www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -182 ఆదివారం 18 అక్టోబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

వయసు ఆధారిత ఆంక్షలు వద్దు

పిల్లల భద్రత, ఇంటర్నెట్ స్వేచ్ఛ రెండూ ముఖ్యమే: సుప్రీంకోర్టు

ఆన్‌లైన్ వేధింపుల నివారణకు కఠిన నిబంధనలు అమలు చేయాలి



రష్యా చమురుపై ఆంక్షలు ఎత్తివేసిన ట్రంప్

- భారత్, చైనాలకు ఊరట..

ఉక్రెయిన్ తీవ్ర ఆగ్రహం



2లో



బంగ్లాదేశ్ రిసార్టులో ఘోర అగ్నిప్రమాదం

- 10 మంది మృతి.. 9 మందికి గాయాలు

- మరికొందరి ఆచూకీ గల్లంతు

ఢాకా,అక్టోబర్ 17 (ప్రజావినికిడి):బంగ్లాదేశ్‌లోని ప్ర ముఖ పర్యాటక ప్రాంతం కాక్స్ బజార్‌లో ఘోర అగ్నిప్ర మా దం చోటుచేసుకుంది. ఇనానీ ప్రాంతంలోని పటువార్టెక్ బీచ్ సమీపంలో ఉన్న ఓ సముద్రతీర విడిది కేంద్రంలో శనివారం తెల్లవారుజామున మంటలు చెలరేగడంతో 10 మంది

మిగతా2లో...

రైతుల భూమికి భరోసా..

సాగునీటి ప్రాజెక్టుకు కొత్త ప్రతిపాదనలు!

- సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రి తుమ్మల భేటీ - పైపుల కాలువలతో 9,767 ఎకరాల భూమి ఆదా.. రూ.2,148 కోట్ల వ్యయం తగ్గించే అవకాశం



హైదరాబాద్,అక్టోబర్ 17 (ప్రజావినికిడి)::రైతుల భూములను కాపాడటంతో పాటు సాగునీటి ప్రాజెక్టుల వ్యయాన్ని తగ్గించడం, ఆయిల్‌పామ్ తోటల్లో విద్యుత్తు ప్రమాదాలను నివారించడం లక్ష్యంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రతిపాదనలు చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పలు లేఖలు అందజేసి, సీతారామ ఎత్తిపోతల పథకంలో సాధ్యమైన ప్రాంతాల్లో పైపుల ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరారు. **రూ.2,148 కోట్ల వరకు ఆదా**సీతారామ ప్రాజెక్టు పంపిణీ కాలువలను పైపుల వ్యవస్థగా మార్చితే సుమారు 9,767 ఎకరాల భూమి ఆదా కావడంతో పాటు భూసేకరణ వ్యయంలో

మిగతా2లో...



విద్యార్థినులపై పోలీసుల దౌర్జన్యం సిగ్గుచేటు

- ప్రశ్నించే గొంతులను అణచివేసే కుట్ర జరుగుతోంది: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ,అక్టోబర్ 17(ప్రజావినికిడి): ప్రజాస్వామ్యం కోసం గొంతెత్తిన విద్యార్థినులపై ఢిల్లీ పోలీసులు దౌర్జన్యానికి పాల్పడటం సిగ్గుచేటని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ విమర్శించారు. విద్యార్థులను

మిగతా2లో...

నీరు, విద్యుత్ పొదుపుగా వినియోగించాలి

- ఎల్‌నినో ప్రభావంతో మారుతున్న వాతావరణ పరిస్థితులు - రాష్ట్రంలో విద్యుత్ అవసరం 20 వేల మెగావాట్లు: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



హైదరాబాద్,అక్టోబర్ 17(ప్రజావినికిడి): ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజలకు పిలుపునిచ్చారు. మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ నీరు, విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అవసరమైన మేరకే వనరులను వినియోగిస్తూ వృథాను అరికట్టాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన బతుకమ్మ యువ చిత్ర నిర్మాతల పురస్కారాల ప్రదానోత్సవంలో భట్టి విక్రమార్క పాల్గొని విజేతలకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన

మిగతా2లో...

గోదావరి – కావేరి అనుసంధానం ముసుగులో మరో కుట్ర!

తెలంగాణ జల హక్కులకు ముప్పు కలిగించే ప్రయత్నాలు: హరీశ్‌రావు ఆందోళన



2లో

హైదరాబాద్,అక్టోబర్ 17 (ప్రజావినికిడి):గోదావరికావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టు పేరుతో తెలంగాణ నీటి ప్రయోజనాలకు నష్టం కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాజెక్టు మార్గాన్ని పోలవరం వైపు మళ్లించే ప్రయత్నం చేస్తోందని

మిగతా2లో...

ప్రకృతి ఆరాధనే బతుకమ్మ

- తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ ప్రతీక: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్,అక్టోబర్ 17 (ప్రజావినికిడి):

తెలంగాణ ఆడపడుచులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజించే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆడపడుచులంతా బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సీఎం ఆకాంక్షించారు. తెలంగాణ అస్తిత్వాన్ని

మిగతా2లో...

పర్యాటక కేంద్రంగా ఎల్లమ్మ చెరువు

హుస్నాబాద్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

గాజు వంతెన, గుట్టను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతాం: మంత్రి పొన్నం ప్రభాకర్



2లో

క్లిష్ట పరిస్థితుల్లో బీజేపీకి విదేశీ నినాదమే ఆధారం!

- మోదీ పాలనలో ఏ వర్గానికీ న్యాయం జరగలేదు: పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్



2లో

వయసు ఆధారిత ఆంక్షలు వద్దు

న్యూఢిల్లీ,అక్టోబర్ 17(ప్రజావినికిడి):::ఇంటర్నెట్ వినియోగించుకునే హక్కు పెద్దలతో పాటు పిల్లలకూ ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వయసును ప్రాతిపదికగా తీసుకుని ఇంటర్నెట్ వినియోగంపై పూర్తిస్థాయి ఆంక్షలు విధించడం సమంజసం కాదని పేర్కొంది. ఇలాంటి పరిమితుల వల్ల పిల్లలు రహస్యంగా ఇంటర్నెట్‌ను వినియోగించే ప్రమాదం ఉందని, ఆన్‌లైన్‌లో వేధింపులు లేదా బెదిరింపులు ఎదురైనా తల్లిదండ్రులకు చెప్పేందుకు వెనుకాడే అవకాశం ఉందని అభిప్రాయపడింది.జస్టిస్ జె.బి. పార్థీవాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఇంటర్నెట్ సృజనాత్మక వ్యక్తీకరణకు, సమాచార మార్పిడికి, విద్యాభ్యాసానికి ఉపయోగపడుతుందని పేర్కొంది. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లోని పిల్లలకు, ప్రత్యేక అవసరాలు ఉన్న చిన్నారులకు ఆన్‌లైన్ వేదికలు ఎంతో సహాయపడుతున్నాయని తెలిపింది. అదే సమయంలో పిల్లలను ఆన్‌లైన్ లైంగిక వేధింపుల నుంచి రక్షించాల్సిన అవసరాన్ని ధర్మాసనం గుర్తుచే సింది. హానికరమైన సమాచారాన్ని గుర్తించి తొలగించడంలో సామాజిక మాధ్యమ వేదికలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించింది. పిల్లల ఖాతాల భద్రత కోసం ప్రత్యేకంగా 'బాలల భద్రతా విధానం' ప్రవేశపె ట్టడం మంచిదని అభిప్రాయ పడింది. చిన్నా రులకు ఇంటర్నె ట్ సదుపాయాన్ని పూర్తిగా నిరాకరించడం కాకుండా, వారి భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రానికి సూచించింది. సురక్షితమైన డిజి టల్ వాతావరణం కల్పించేందుకు సామాజిక మాధ్య మాల్లో లైంగిక వేధిం పులకు సంబంధించిన సమా చారాన్ని తొలగిం చేలా కఠిన నిబంధనలు అమలు చేయాలని పేర్కొంది.

పర్యాటక కేంద్రంగా ఎల్లమ్మ చెరువు

సిద్దిపేట,అక్టోబర్ 17 (ప్రజావినికిడి):హుస్నాబాద్ పట్టణంలోని చారిత్రక ఎల్లమ్మ చెరువును ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. చెరువుతో పాటు గాజు వంతెన, సమీపంలోని గుట్టను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఎల్లమ్మ చెరువు వద్ద చేపట్టిన సుందరీకరణ పనులు, పండుగ ఏర్పాట్లను మంత్రి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. పండుగకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.హుస్నాబాద్ నియోజకవర్గాన్ని పర్యాటకం, విద్య, వైద్యం, క్రీడలు, రహదారులు, సాగునీటి రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. పట్టణానికి కబడ్డీ అకాడమీతో పాటు ఈత కొలను కూడా మంజూరైనట్లు చెప్పారు. 2007లో శంకుస్థాపన చేసిన గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన అడ్డంకులు తొలగిపోయాయని, ప్రస్తుతం కాలువల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ జరుగుతోందని వివరించారు. ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి వెల్లడించారు.ఎల్లమ్మ చెరువు అభివృద్ధితో హుస్నాబాద్ ప్రాంతానికి పర్యాటకంగా మరింత గుర్తింపు రావడంతో పాటు స్థానికంగా ఉపాధి, వ్యాపార అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఆరోగ్యంపై దృష్టి సారించాలి.. క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలి:

మంత్రి శ్రీధర్‌బాబు

వరంగల్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తాం.. త్వరలో విమానాశ్రయం,

హనుమకొండలో ఐటీ టవర్



హనుమకొండఅక్టోబర్ 17 (ప్రజావినికిడి):యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. వ్యాయామం, క్రీడలు, ధ్యానం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను పొందవచ్చని తెలిపారు.నాయిని విశాల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. జాతీయ సాంకేతిక విద్యాసంస్థ నుంచి హయగ్రీవాచారి మైదానం వరకు జరిగిన ఈ పరుగులో 5, 10, 21 కిలోమీటర్ల విభాగాలను ఏర్పాటు చేశారు. యువతలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు క్రీడాస్ఫూర్తిని ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని మంత్రి పేర్కొన్నారు.హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా వరంగల్ నిలుస్తోందని శ్రీధర్‌బాబు అన్నారు. వరంగల్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. త్వరలో వరంగల్ విమానాశ్రయాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని, హనుమకొండలో ఐటీ టవర్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను గుర్తించి, యువతకు తగిన అవకాశాలు కల్పించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల భూమికి భరోసా.. సాగునీటి ప్రాజెక్టుకు కొత్త ప్రతిపాదనలు!

(మొదటి పేజీ తరువాయి)

రూ.2,148.74 కోట్ల వరకు తగ్గింపు సాధ్యమవుతుందని మంత్రి అంచనా వివరించారు. ఈ పథకం ద్వారా మొత్తం 6.74 లక్షల ఎకరాలకు సాగునీటి ప్రయోజనం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. భూముల సేకరణతో రైతులకు ఇబ్బందులు కలగకుండా, పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.**ఆయిల్‌పామ్ తోటల్లో విద్యుత్తు ప్రమాదాల నివారణ**ఆయిల్‌పామ్ చెట్ల ఆకులు, కొమ్మలు విద్యుత్తు తీగలకు తగలడం వల్ల సరఫరాలో అంతరాయాలు, ప్రమాదాలు ఏర్పడుతున్నాయని మంత్రి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 11 కేవీ విద్యుత్తు లైన్లకు కవర్డ్ కండక్టర్లు, అవసరమైన చోట తక్కువ వోల్టేజీ లైన్లకు ప్రత్యేక కేబుళ్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కొత్త, పాత తోటల్లో దశలవారీగా మార్పులు చేపట్టేందుకు రాష్ట్రస్థాయి ఉమ్మడి విధానం రూపొందించాలని కోరారు.**దుమ్ముగూడెం వద్ద నీటి నిల్వకు చర్యలు**దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద ఇసుక బస్తాలతో తాత్కాలికంగా నీటిని నిల్వ చేసి సుమారు ఒక టీఎంసీ నీటిని వినియోగించుకునే అవకాశాన్ని మంత్రి వివరించారు. సుమారు రూ.30 లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టవచ్చని తెలిపారు. దీనివల్ల సాగు, తాగునీటి అవసరాలకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ పనులను వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. **ఖమ్మం అభివృద్ధికి నిధులు కోరిన మంత్రి**ఖమ్మం నగరంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ, తాగునీటి పథకాలకు సంబంధించిన నివేదికలను ఆమోదించి నిధులు విడుదల చేయాలని మంత్రి కోరారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే యాతాలకుంట టన్నెల్ పనులను త్వరగా పూర్తి చేసి సత్తుపల్లి, వేంసూరు, అశ్వారావుపేట, దమ్మపేట ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించాలని కోరారు.

నీరు, విద్యుత్ పొదుపుగా వినియోగించాలి

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ, గతంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో చలి తీవ్రంగా ఉండేదని, ప్రస్తుతం అందుకు భిన్నంగా వాతావరణ పరిస్థితులు మారుతున్నాయని తెలిపారు. ఒకప్పుడు చలి నుంచి రక్షించుకునేందుకు జాగ్రత్తలు తీసుకునేవారని, ప్రస్తుతం వేడి నుంచి కాపాడుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.వాతావరణంలో వస్తున్న మార్పులు ప్రజల జీవన విధానంపై ప్రభావం చూపుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో నీరు, విద్యుత్ వంటి కీలక వనరులను బాధ్యతాయుతంగా వినియోగించడం అవసరమని తెలిపారు.రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుత్ అవసరం 20 వేల మెగావాటాలకు చేరిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు విద్యుత్‌ను అనవసరంగా వినియోగించకుండా పొదుపు చర్యలు పాటించాలని సూచించారు. నీటిని కూడా వృథా చేయకుండా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని వినియోగించాలని పిలుపునిచ్చారు.

క్లిష్ట పరిస్థితుల్లో బీజేపీకి విదేశీ నినాదమే ఆధారం!

హైదరాబాద్, అక్టోబర్ 17 (ప్రజావినికిడి)::క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడల్లా విదేశీ అంశాలను తెరపైకి తీసుకురావడం బీజేపీకి అలవాటుగా మారిందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. గత పదమూడేళ్లుగా ఇదే ధోరణి కొనసాగుతోందని, ప్రస్తుతం బంగ్లాదేశ్ అంశాన్ని కూడా అదే విధంగా ప్రస్తావిస్తున్నారని ఆరోపించారు.శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ వృత్తి నిపుణుల విభాగం అధ్యక్షుడు మధు యాష్కీలతో కలిసి మహేశ్‌కుమార్ గౌడ్ విలేకరులతో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో దేశంలోని ఏ వర్గానికీ న్యాయం జరగలేదని ఆయన విమర్శించారు. దేశభక్తి గురించి మాట్లాడే బీజేపీ నాయకులు భారత భూభాగంలోకి చైనా చొచ్చుకొచ్చినప్పుడు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.**ఎన్నికల సంఘంపై విమర్శలు**ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేశ్‌కుమార్ నియామకం కోసం కేంద్ర ప్రభుత్వం నియామక వ్యవస్థలో మార్పులు చేసిందని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపరుస్తున్న కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘాన్ని ఉపయోగించుకుని మైనారిటీలు, గిరిజనులు, లౌకికవాదుల ఓట్లను తొలగిస్తోందని విమర్శించారు.తెలంగాణలోనే 27 శాతం ఓట్లు తొలగించారని ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్రలో ఎన్నికల ఫలితాల్లో మూడు నెలల వ్యవధిలో గణనీయమైన మార్పు ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు.

బంగ్లాదేశ్ రిసార్టులో ఘోర అగ్నిప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

ప్రాణాలు కోల్పోగా, మరో తొమ్మిది మంది గాయపడ్డారు. మరికొందరి ఆచూకీ తెలియకపోవడంతో ఆందోళన నెలకొంది.మంటలు వేగంగా వ్యాపించడంతో మూడు అంతస్తుల కలప భవనం పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ సుమారు 30 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. కొందరు ప్రాణాలతో బయటపడగా, మిగతావారి పరిస్థితిపై స్పష్టత రావాల్సి ఉంది.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను గుర్తించేందుకు అవసరమైన నమూనాలను సేకరించనున్నట్లు అధికారులు వెల్లడించారు.అగ్నిప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. వంటగదిలో మంటలు చెలరేగడం లేదా విద్యుత్ లోపం కారణమై ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నప్పటికీ, దర్యాప్తు పూర్తయ్యే వరకు నిర్ధారణకు రాలేమని అధికారులు తెలిపారు.

విద్యార్థినులపై పోలీసుల దౌర్జన్యం సిగ్గుచేటు

(మొదటి పేజీ తరువాయి)

భయభ్రాంతులకు గురిచేసి, వారు మరోసారి ప్రశ్నించకుండా చేయడమే లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు.విద్యార్థులతో మాట్లాడిన సందర్భంగా వారు వెల్లడించిన విషయాలను రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పంచుకున్నారు. పోలీసుల దాడుల్లో తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, దుస్తులు లాగడం, శరీరంలోని వ్యక్తిగత భాగాలను తాకడం వంటి చర్యలకు పాల్పడ్డారని బాధిత విద్యార్థినులు తనకు చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతులను అణచివేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని రాహుల్ ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను ఉద్దేశించి విమర్శలు చేశారు. యువత, మహిళలపై పోలీసుల హింస ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతుందని పేర్కొన్నారు.ఈ ఘటనపై సంబంధిత పోలీసులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. అయితే, విద్యార్థినులు చేసిన ఆరోపణలపై అధికారికంగా వెలువడే వివరాలు, దర్యాప్తు ఫలితాలు కీలకం కానున్నాయి.

ప్రకృతి ఆరాధనే బతుకమ్మ

(మొదటి పేజీ తరువాయి)

చాటిచెప్పే ఈ పండుగ ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తుందని తెలిపారు. పూలతో బతుకమ్మను అలంకరించి, పాటలు పాడుతూ సంప్రదాయబద్ధంగా జరుపుకునే ఈ వేడుకలు మన సంస్కృతీ వైభవాన్ని ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

సీజేపీ నేత అభిజీత్ దీప్కేకు బెయిల్

- **ఏడాది పాటు శాంతిభద్రతలకు భంగం కలిగించరాదని షరతు**
- **నిరసన ప్రదర్శనకు వెళ్తుండగా నిర్బంధం.. నేహా బోరా కూడా విడుదల**

న్యూఢిల్లీ,అక్టోబర్ 17(ప్రజావినికిడి): కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేకు ఢిల్లీలోని ప్రత్యేక కార్యనిర్వాహక మేజిస్ట్రేట్ శనివారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో నిర్వహించిన 'లెహ్రా దో తిరంగా' నిరసన ప్రదర్శనలో పాల్గొనేందుకు వెళ్తుండగా పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు.ముందస్తు చర్యల్లో భాగంగా దీప్కేపై కేసు నమోదు చేసి, మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఏడాది పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడబోనని హామీ ఇస్తూ పూచీకత్తు సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి నిర్బంధం అవసరం లేదని పేర్కొంటూ షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.ఇదే నిరసన ప్రదర్శనలో పాల్గొన్న అఖిల భారత విద్యార్థి సంఘం అధ్యక్షురాలు నేహా బోరాను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం శనివారం ఉదయం ఆర్‌కే పురం పోలీస్‌స్టేషన్ నుంచి ఆమెను విడుదల చేశారు.

గోదావరికావేరి అనుసంధానం ముసుగులో మరో కుట్ర!

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. దీనివల్ల తెలంగాణకు దక్కాల్సిన గోదావరి జలాల వాటాపై ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.గోదావరికావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టుపై నవంబర్ 3న ఢిల్లీలో జాతీయ జల అభివృద్ధి సంస్థ సమావేశం జరగనున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించాలని హరీశ్‌రావు కోరారు. రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలగకుండా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.తెలంగాణకు రావాల్సిన గోదావరి జలాల వాటాపై స్పష్టత వచ్చిన తర్వాతే నదుల అనుసంధాన ప్రాజెక్టుపై ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. రాష్ట్ర సాగునీటి ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరారు.**గోదావరి జలాల వాటాపై స్పష్టత అవసరం** తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన నీటి వాటాను పరిరక్షించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని హరీశ్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నదుల అనుసంధాన ప్రతిపాదనలను పరిశీలించాలని సూచించారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

- **సమగ్ర భూ సర్వేపై మంత్రి పొంగులేటి సమీక్ష**
- **భూ యజమానులకు ముందస్తు నోటీసులు ఇవ్వాలి.. పారదర్శకంగా సర్వే చేపట్టాలి**



హైదరాబాద్,అక్టోబర్ 17 (ప్రజావినికిడి):తెలంగాణ రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వేపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. భూ సర్వేలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని, సర్వే ప్రారంభించే ముందు భూ యజమానులకు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్రవ్యాప్తంగా మూడు దశల్లో భూ సర్వే నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. తొలి దశలో ఇప్పటికే 2,720 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, వచ్చే నెలాఖరులోగా మొదటి దశను పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ప్రతి భూకమతానికి కచ్చితమైన సరిహద్దులు నిర్ణయించి, ప్రతి సర్వే నంబరుకు ప్రత్యేక భూదార్ గుర్తింపు సంఖ్య కేటాయించనున్నట్లు చెప్పారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూములను కొలిచి, వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరచడంతో పాటు భూభారతి అంతర్జాల వేదికలో నమోదు చేస్తామని తెలిపారు. సర్వేకు సంబంధించి భూ యజమానులకు అభ్యంతరాలు ఉంటే స్వీకరించి పరిశీలిస్తామని స్పష్టం చేశారు.ప్రభుత్వ భూములు, ప్రైవేటు భూములు, గ్రామకంఠాల సరిహద్దుల విషయంలో స్పష్టత ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

ఆదివారం 18 అక్టోబర్ 2026

అలంపురంలో దేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు.

శ్రీ జోగులాంబ అమ్మవారికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించిన కర్నూలు జిల్లా కలెక్టర్ సిరి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న కర్నూలు కలెక్టర్ సిరి



షాద్ నగర్,(ప్రజావినికిడి):
జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అలంపూర్ జోగులాంబ మాత క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా కలెక్టర్ సిరి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున మాత జోగులాంబ అమ్మవారికి నేడు పట్టు వస్త్రాలు సమర్పించడం జరిగింది,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రతి సంవత్సరం అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం సాంప్రదాయంగా వస్తుందన్నారు, రాష్ట్రాలు విభజన జరిగినా కూడా సాంప్రదాయబద్ధంగా జోగులాంబ అమ్మవారికి ప్రతి సంవత్సరం పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి,రాష్ట్ర ప్రజలకు అమ్మవారి ఆశీర్వాదంతో సుభిక్షంగా ఉండాలని ఈ సందర్భంగా టి,టిడిపి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు,పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి..

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి..

రంగారెడ్డి,(ప్రజావినికిడి):
ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు.
శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు,అదనపు కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ.లు, ఎ.ఈ.ఆర్.ఓ.లు, ఎన్నికల విభాగం అధికారులతో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై సమీక్ష సమావేశంనిర్వహించారు.ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ఎ.ఈ.ఆర్.ఓ.లు తమ పరిధి లోని బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్ల తో సమన్వయం చేసుకుంటూ ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు.నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసే విధంగా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా కొనసాగేందుకు సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పని



చేయాలని తెలిపారు. అక్టోబర్ 1వ తేదీ ప్రామాణికంగా 18 సంవత్సరాలు నిండిన,అర్హత గల ప్రతి ఒక్క ఓటరు వివరాలు జాబితాలో తప్పనిసరిగా ఉండాలని, అనర్హుల వివరాలు ఖచ్చితంగా ఉండకూడదని తెలిపారు.
సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న ఇంచార్జి జిల్లా కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ, జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఎన్నికల సంఘం



నిబంధనల మేరకు నిర్వహించడం జరుగుతుందని, పెండింగ్ లో ఉన్న ఫారం 6,7, 8 పరిష్కారం, నోటీసుల జారీ ప్రక్రియను నిబంధనల ప్రకారం సక్రమంగా నిర్వహించడం, ఓటర్ల నుండి సేకరించిన ధ్రువ పత్రాలను నిబంధనల మేరకు పరిశీలించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదా దేవి,కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి,ఎన్నికల విభాగం అధికారి రవీంద్ర గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్,(ప్రజావినికిడి):
పట్టణంలోని ఆర్టీసీ కాలనీ హనుమాన్ దేవాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో మహాలక్ష్మి దేవి అవతారంలో దర్శనం ఇచ్చిన అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ దర్శించుకుని, భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అక్కడ నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని అంజయ్య యాదవ్ ప్రారంభించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.దుర్గామాత ఉత్సవాలు భక్తుల్లో ఆధ్యాత్మిక భావాన్ని,ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంకాయ



నారాయణరెడ్డి,మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్,మున్సిపల్ చైర్మన్ దేవేందర్ యాదవ్,వార్డు అధ్యక్షులు మల్చలం భిక్షపతి, కౌన్సిలర్లు పిన్నమోని గోపాల్,ఎస్పీ శివ,మాజీ సర్పంచులు యాదయ్య,రమేష్, సామాజికవేత్త వంగూరి గంగిరెడ్డి,నాయకులు రవి యాదవ్,నారాయణ,రవి



నాయక్,శేఖర్,రామరాజు, అరుణ్ కుమార్,విష్ణువర్ధన్ తదితరులు,కాలనీ వాసులు మాజీ జడ్పీటీసీ సాయికృష్ణ, నారాయణ,మల్చలం మురళీ,రాజు, మురళీధర్ గౌడ్,ఎల్లన్న గౌడ్, వినయ్ కుమార్,రమేష్, అరవింద్ పటేల్ తదితరులు భక్తులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం..

షాద్‌నగర్,(ప్రజావినికిడి):
షాద్ నగర్ పట్టణ శివారులోని పరిగి రోడ్డులోనీ విష్ణు గ్రానైట్ కంపెనీ సమీపంలో శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి రెండు బైకులను ఢీకొట్టి పల్టీలు కొడుతూ చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది.ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా,బైకులపై ప్రయాణిస్తున్న ముగ్గురువ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు.స్థానికుల సమాచారం ప్రకారం, కారు డ్రైవర్ ఉదయం మద్యం సేవించి వేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడిపాడు అన్నారు.సదరు వాహనంలో మద్యం బాటిల్ సైతం దర్శనమిచ్చింది. సర్దార్‌నగర్ వద్ద కక్కునూరు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ప్రయాణిస్తున్న బైక్‌ను కారు ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు.అనంతరం అదే కారు షాద్‌నగర్ వైపు దూసుకొచ్చి పట్టణ శివారులో




మరో బైక్‌ను ఢీకొట్టింది.ఈ క్రమంలో కారు అదుపుతప్పి పల్టీలు కొడుతూ రోడ్డుపక్కన ఉన్న చెట్ల పొదల్లోకి వెళ్లి ఆగిపోయింది.
ప్రమాద తీవ్రతను చూసి ప్రత్యక్ష సాక్షులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.
మరో బైక్‌పై ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స



నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మృతదేహాన్ని సైతం ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.ప్రమాదానికి మద్యం సేవించి వాహనం నడపడం,అతివేగం కారణమా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు,మృతుడి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడికానున్నాయి.

తీగల కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో పెద్ద ఎత్తున బతుకమ్మ సంబరాలు





మహేశ్వరం, అక్టోబర్ 17,(ప్రజావినికిడి):
మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ లోని తీగల కృష్ణారెడ్డి ఎడ్యుకేషన్ సొసైటీలో బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా శనివారం రోజు కళాశాల మైదానంలో దాదాపు 5వేలకు పైగా విద్యార్థులతో పెద్ద ఎత్తున బతుకమ్మ దాండియా కార్యక్రమాల నిర్వహించిన కళాశాల యజమాన్యం ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ తీగల కృష్ణారెడ్డి అలాగే సెక్రెటరీ హరినాథ్ రెడ్డి ట్రెజరర్ అమర్నాథ్ రెడ్డి ప్రిన్సిపల్స్ హెచ్వోడీలు హాజరై పెద్ద ఎత్తున బతుకమ్మ సంబరాలను విజయవంతం చేయడం జరిగినది తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ సాంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ పండుగ ప్రతి ఇంట్లో ఈ తొమ్మిది రోజులు బతుకమ్మ సంబరాలు నిర్వహించడం మన ఆడపడుచులకు ఎంతగానో సంతోషం ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేసిన వారందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రత్యేక నగదు బహుమతులను అందజేయడం జరిగినది.

ఎల్బీనగర్ సీఐ వెంకటేష్ కు శుభాకాంక్షలు తెలియజేసిన ప్రశాంత్ గౌడ్



ఎల్బీనగర్, (ప్రజావినికిడి): అక్టోబర్ 17,
నూతనంగా ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన బత్తిని వెంకటేష్ గౌడ్‌ను బీఆర్ఎస్ యువజన నాయకులు అంతటి నరేష్ గౌడ్,ఉయ్యాల ప్రశాంత్ గౌడ్, సిద్ధగోని రమేష్ కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయనకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

అప్కారీ భవన్ లో ఎక్సైజ్ ఉద్యోగుల బతుకమ్మ వేడుకలు



నాంపల్లి, (ప్రజావినికిడి): హైదరాబాద్ నాంపల్లి ఎక్సైజ్ భవన్ లో ఎక్సైజ్ ఉద్యోగులు, టీజీబీసీఎల్ ఉద్యోగులు శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.శ్రీ లలిత అమ్మవారి గుడి ఆవరణలో బతుకమ్మ ఆటపాట కొనసాగించారు. మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ ప్రణవి, టిజిబిసిఎల్ జిఎంబి అంశ అసిస్టెంట్ మేనేజర్లు విజయలక్ష్మి, విజయ,విష్ణు ప్రియ ఇతర ఉద్యోగులు సర్వీసెస్ నాగలక్ష్మి సరితతో పాటు ఇతర మహిళా ఉద్యోగులు బతుకమ్మ ఆటపాటలు కొనసాగించారు.ఈ బతుకమ్మ వేడుకల్లో ముఖ్య అతిథులుగా జాయింట్ కమిషనర్ రాథోడ్ సురేష్, సైబరాబాద్ డిప్యూటీ కమిషనర్ జె హరి కిషన్, టిజిబిసిఎల్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, ప్రమోద్,జిటి జీవన్,తిరుపతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మహాలక్ష్మి అలంకరణలో కట్టమైసమ్మ అమ్మవారి దర్శనం

అమ్మవారిని దర్శించుకున్న బీఆర్ఎస్ యువనేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి



రాజేంద్రనగర్, (ప్రజావినికిడి): అక్టోబర్ 17, రాజేంద్రనగర్ పరిధిలోని శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ దేవాలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు అమ్మవారు శ్రీమహాలక్ష్మి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.ఈ సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జి, యువనేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీమహాలక్ష్మి అమ్మవారి దర్శనం సకల శుభాలకు, ఐశ్వర్యానికి ప్రతీక అని కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తిభావంతో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తున్నాయని తెలిపారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

మహంకాళి వాలీబాల్ టోర్నమెంట్ విజేత శ్రీరాం నగర్



వాజేడు,అక్టోబర్ 18,(ప్రజావినికిడి):విజయదశమి సందర్భంగా చెరుకూరు గ్రామ పంచాయతీ లో మహంకాళి యూత్ ఆధ్వర్యం లో వాలీబాల్ టోర్నమెంట్ అక్టోబర్ 16, నుండి 17,వరకు జరిగిన ఈ టోర్నీలో ఎనిమిది జట్లు తలపడ్డాయి మొదటి విజేతగా శ్రీరాంనగర్ జట్టు రన్నర్స్ గా చెరుకురు గ్రామం టీమ్ రెండవ బహుమతి మూడవ బహుమతి బయ్యారం జట్టు గెలుపొందేరు మొదటి జట్టుకు మహంకాళి యూత్ 10,000 రూపాయలు అందజేశారు. రెండవ బహుమతి ఎఎన్ఎస్, ఆదివాసి నవనిర్మాణ సేనా 5000 రూపాయలు మూడవ బహుమతి ఎఎన్ఎస్. ఆదివాసి నవనిర్మాణ సేనా బహుమతిగా అందజేశారు గెలుపొందిన వారికి షీల్డ్ మెడల్స్ కొత్తగట్టు శ్రీనివాసరావు అందజేశారు.ఈ కార్యక్రమంలో చెరుకూరు పంచాయతీ లోని గ్రామస్థులు మహంకాళి యూత్ ఎఎన్ఎస్.జిల్లా మండల నాయకులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ఎఎన్ఎస్,జిల్లా అధ్యక్షులు ఎట్టి విద్యాసాగర్ మాట్లాడుతూ, యువత చెడు అలవాట్లకు మత్తు పానియాలకు అలవాటు పడకుండా దేహదారుఢ్య లను పెంపొందించుకుని ఇలాంటి కార్యక్రమాలు మునుముందు మండల స్థాయిలో కూడా జరపాలని అన్నారు.ఈ కార్యక్రమంలో చెరుకూరు పంచాయతీ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు

యువత ఆధ్యాత్మిక భావాలను ఆచరణలో పెట్టండి

దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన పేరూరు ఎస్సై ఆర్.అశోక్



వాజేడు,అక్టోబర్ 18,(ప్రజావినికిడి):ధర్మావరం గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాత కు పేరూరు ఎస్సై ఆర్ అశోక్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.అనంతరం అక్కడ నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఎటువంటి గొడవలు తావు లేకుండా దుర్గామాత ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గామాత యువత గ్రామ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గోవా మద్యం గుట్టు రట్టు.. 140 బాటిళ్లు సీజ్..

శంషాబాద్ ఎయిర్‌పోర్టు రోడ్డులో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు


శంషాబాద్, (ప్రజావినికిడి):



అక్టోబర్ 17, దసరా పండుగ వేళ అక్రమ మద్యం రవాణాపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిఘా ముమ్మరం చేశారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హైదరాబాద్ వైపు వచ్చే ప్రధాన రహదారిపై చేపట్టిన వాహనాల తనిఖీల్లో గోవా నుంచి తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్న 140 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వివిధ బ్రాండ్లకు చెందిన మద్యం బాటిళ్లను కార్లలో తరలిస్తుండగా అధికారులు గుర్తించి సీజ్ చేశారు.ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణకు అక్రమంగా మద్యం తీసుకురావడాన్ని సహించేది లేదని అధికారులు హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పండుగ నేపథ్యంలో అక్రమ మద్యం రవాణాను అడ్డుకునేందుకు తనిఖీలు మరింత ముమ్మరం చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

పెద్ద జానంపేటలో వైభవంగా శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న: ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి దంపతులు





షాద్‌నగర్,(ప్రజావినికిడి): అక్టోబర్ 17,
శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా షాద్‌నగర్ పట్టణ పరిధిలోని పెద్ద జానంపేట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు.భక్తి పారవశ్యంతో కొనసాగిన ఈ ఉత్సవాల్లో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కుంకుమార్చన,చండీ హోమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి దంపతులు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో మండప పూజ,కుంకుమార్చన,హోమం, చండీ హోమం తదితర కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. వేదమంత్రాల నడుమ సాగిన పూజా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుందిఅన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ దంపతులు
పూజా కార్యక్రమాల అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలోనూ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం అందించే కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో భక్తిభావం, సేవాభావం, ఐక్యతను చాటిచెబుతున్నాయని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో
కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్,మాజీ కౌన్సిలర్లు చింటూ ప్రతాప్ రెడ్డి,యుగేందర్,నందకిషోర్,
బచ్చలి నరసింహులు,జూపల్లి శంకర్,పాలమాకుల



చెన్నయ్య,పోమాల్ పల్లి సర్పంచ్ సప్న భూపాల్ రెడ్డి,కంటెస్టెడ్ కౌన్సిలర్లు నక్కల వెంకటేష్ గౌడ్,రాజేందర్ సింగ్,మాజీ సర్పంచ్ సుధాకర్ గౌడ్,అడ్వకేట్ మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్ రాజు,నాయకులు అల్లాడ శేఖర్,ప్రభాకర్, దినేష్ సాగర్,శివ,తదితరులు పాల్గొన్నారు.

బీరమయ్య ఆలయ పూర్వ చరిత్రను వెలుగులోకి తీసుకొస్తాం

సమ్మక్క సారలమ్మ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్
తెలుగు,హిందీ, ఇంగ్లీష్ భాషల్లో పుస్తక రూపంలో ఈ ఏడాది జాతర వరకు ప్రచురణ





వాజేడు,అక్టోబర్ 18,(ప్రజావినికిడి):
జిల్లా వాజేడు మండలం టేకులగూడెం గ్రామపంచాయతీ పరిధిలో తెలంగాణ చత్తీస్గడ్ సరిహద్దులో గోదావరి నది ఒడ్డున ఉన్న ప్రాచీన బీరమయ్య ఆలయ పూర్వ చరిత్ర,కోయ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా శనివారం ప్రత్యేక అధ్యయన కార్యక్రమం నిర్వహించారు. టేకులగూడెం గ్రామ సర్పంచ్ చిడెం బాలకృష్ణ, మాజీ సర్పంచులు వాసం ఆనందరావు యలం అచ్చయ్య ఆధ్వర్యంలో బీరమయ్య ప్రధాన పూజారులు, టేకులగూడెం, కృష్టాపురం గ్రామాల పెద్దమనుషులు, తుడుందెబ్బ వాజేడు మండల నాయకుల సమక్షంలో సమ్మక్క సారలమ్మ ఆర్కియాలజీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధక బృందం ఈ అధ్యయనాన్ని చేపట్టింది.కోయ సంప్రదాయాలతో ప్రత్యేక పూజలు కార్యక్రమంలో భాగంగా ముందుగా గోదావరి నది లో గంగమ్మకు సిరాసారెలతో పసుపు కుంకుమ లతో నదిలోకి దిగి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లోటపేట గండి మీదుగా కొండపై ఉన్న బీరమయ్య ఆలయ ప్రాంగణానికి చేరుకున్న పరిశోధక బృందం గోదావరి గంగాజలంతో ఆలయాన్ని శుద్ధి చేసి కోయ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం బీరమయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం కోయ పెద్దమనుషులు, బీరమయ్య ప్రధాన పూజారులు, పరిశోధక బృందం సభ్యులు కలిసి ఆలయ పూర్వ చరిత్ర,ఆచార వ్యవహారాలు, పూజా విధానాలు, తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయాలపై సుదీర్ఘంగా చర్చించారు. గ్రామ పెద్దల అనుభవాలు, పూర్వీకుల నుంచి అందిన చారిత్రక సమాచారాన్ని పరిగణనలోకి తీసుకుని ఆలయ చరిత్రను సమగ్రంగా నమోదు చేయడంపై దృష్టి సారించారు.నాలుగు రాష్ట్రాల అనగా తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ ఛత్తీస్గడ్ మహారాష్ట్ర ప్రజలకు ఆరాధ్య దైవం బీరమయ్య అని అన్నారుప్రతి సంవత్సరం ఏప్రిల్ చివరి వారంలో నిర్వహించే బీరమయ్య జాతరకు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారని బీరమయ్య ప్రధాన పూజారులు తెలిపారు.ఈ జాతర కోయ ఆదివాసీల ఆధ్యాత్మిక విశ్వాసాలకు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోందని వివరించారు. పూర్వకాలంలో కోయరాజ్యాలు పరిపాలన జరిగే సందర్భంలో బీరమయ్య గుట్ట లొట్టపెట్ట గండి దగ్గర కోయ రాజ్యాలకు కోటిలింగాల పంపిణీ జరిగిన ప్రదేశాలు సైతం ఇక్కడ త్రివేణి సంగమం దగ్గర సంఘం రూపంలో ఉన్నాయని తెలిపారు నాలుగో గొట్టు ఏడవగొట్టు విడిపోయిన సందర్భంగా ఇక్కడే అని అన్నారు తాబేలు పై గోదావరి నది దాటిన క్రమంలో తాబేలు తిన్న వారిని పగిడిద్దరాజు స్వచ్ఛంగా మాది సనప గాని వంశమని మీరు ఏడవ గట్టుకు వెళ్ళిపోవాలని సూచించిన చారిత్రక ఆనవాళ్ల ప్రదేశం ఈ బీరమయ్యే సన్నిధి అని అన్నారు.ఇంకా అనేక చారిత్రక అంశాలను బయటకు తీసుకొస్తామని తెలిపారు బీరమయ్య ఆలయానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యతను భావితరాలకు అందించడంతో పాటు,కోయ ఆదివాసీ సమాజం ఆచారాలు, విశ్వాసాలు, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందని సమావేశంలో పాల్గొన్న పెద్దమనుషులు అభిప్రాయపడ్డారు.సుమారు ఏడు గంటల పాటు సాగిన సుదీర్ఘ చర్చల అనంతరం సమ్మక్క సారలమ్మ ఆర్కియాలజీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధక బృందం కీలక నిర్ణయం తీసుకుంది. బీరమయ్య ఆలయ పూర్వ చరిత్రను సేకరించి, పరిశోధించి, తెలుగు,హిందీ, ఇంగ్లీష్ భాషల్లో పుస్తక రూపంలో తీసుకువస్తామని బృంద సభ్యులు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో సమ్మక్క సారలమ్మ ఆర్కియాలజీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సభ్యులు ఇరప ప్రభాకర్,గట్టిపెల్లి అర్జున్,కాక నవ్య,కొమరం ధనలక్ష్మి తో పాటు తుడుందెబ్బ జిల్లా నేతలు పదం సుధాకర్ ఎట్టి చంద్రశేఖర్ బీరమయ్య ప్రధాన పూజారులు, మడే బుచ్చయ్య రవిబాబు కోడె రవి,వాసం లక్ష్మణరావు, సిడం జగపతి పుణ్యం సందీప్, యాలం నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అప్రమత్తమైన భద్రతా సిబ్బంది



శంషాబాద్, (ప్రజావినికిడి): అక్టోబర్ 17, రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బాంబు బెదిరింపు కలకలం రేపింది. అహ్మదాబాద్ నుంచి శంషాబాద్‌కు వస్తున్న ఇండిగో విమానంలో బాంబు ఉందంటూ హెచ్చరికలు రావడంతో విమానాశ్రయ అధికారులు అప్రమత్తమయ్యారు. సమాచారం అందుకున్న సీఐఎస్ఎఫ్ బలగాలు, ఎయిర్‌పోర్టు భద్రతా సిబ్బంది వెంటనే రంగంలోకి దిగారు.విమానం ల్యాండ్ అయిన అనంతరం నిబంధనల ప్రకారం ఐసోలేషన్ బేకు తరలించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సిబ్బందితో విమానంలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. విమానంలోని అన్ని ప్రాంతాలతో పాటు ప్రయాణికుల లగేజీని పరిశీలించారు. బాంబు బెదిరింపు నేపథ్యంలో విమానాశ్రయంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. తనిఖీల్లో అనుమానాస్పద వస్తువులు లభించాయా? బెదిరింపునకు కారణాలేమిటి? అనే వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

రంగారెడ్డి జిల్లాలో ఈఎస్ఐ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలి

కార్మికుల వైద్య సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పానుగంటి పర్వతాలు డిమాండ్



శంషాబాద్, (ప్రజావినికిడి): అక్టోబర్ 17, రంగారెడ్డి జిల్లాలో లక్షలాది మంది కార్మికుల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈఎస్ఐ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని మంజూరు చేసి నిర్మించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పానుగంటి పర్వతాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.జిల్లాలో అనేక పరిశ్రమలు, వివిధ సంస్థల్లో లక్షలాది మంది కార్మికులు పనిచేస్తున్నప్పటికీ,వారికి మెరుగైన వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం విచారకరమన్నారు.శనివారం శంషాబాద్ పట్టణంలో నిర్వహించిన ఏఐటీయూసీ జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో పనిచేస్తున్న కార్మికులు అనారోగ్యానికి గురైతే మెరుగైన వైద్యం కోసం సనత్‌నగర్ లేదా నాచారం ప్రాంతాల్లోని ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు నివసించే ప్రాంతానికి సమీపంలోనే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల ఓట్లతో అధికారంలోకి వచ్చే ప్రభుత్వాలు, వారి సమస్యల పరిష్కారంపై మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని పర్వతాలు విమర్శించారు. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులతో పాటు సాఫ్ట్‌వేర్ రంగంలోని ఉద్యోగులకు కూడా అనేక చోట్ల కనీస వేతనాలు సక్రమంగా అమలు కావడం లేదని,ఉద్యోగ భద్రత కొరవడుతోందని పేర్కొన్నారు. కార్మికుల శ్రమకు తగిన ప్రతిఫలం అందించడంతో పాటు చట్టబద్ధమైన హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. రాబోయే రోజుల్లో కార్మికుల హక్కుల సాధన, కనీస వేతనాల అమలు,ఉద్యోగ భద్రత,మెరుగైన వైద్య సదుపాయాల కల్పన కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉధృతం చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా పోరాడాలని సూచించారు.ఈ సమావేశానికి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వడ్ల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. రాష్ట్ర సమితి సభ్యుడు కే. రామస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. దత్తు నాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పబ్బతి లక్ష్మణ్, తుపాకుల రాములు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్‌పై ఏసీబీ ఆదాయానికి మించిన ఆస్తుల కేసు..

రూ.2.28 కోట్లకు పైగా ఆస్తులు ఉన్నట్లు గుర్తింపు..

రూ.7 లక్షల నగదు,60 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం..

ఇల్లు, కార్యాలయం సహా ఆరు ప్రాంతాల్లో ఏసీబీ సోదాలు..

గతంలో లంచం కేసులోనూ పట్టుబడిన సీఐ ఆంజనేయులు..



హైదరాబాద్,(ప్రజావినికిడి):
తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) మరో అవినీతి అధికారిపై కొరడా ఝళిపించింది. మేడ్చల్‌మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కీసర పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న అర్కపల్లి అంజనేయులుపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసింది.అక్రమ మార్గాలు, అవినీతి పద్ధతుల ద్వారా భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు రావడంతో శనివారం (17-10-2026) ఆయన నివాసం, కార్యాలయంతో పాటు బంధువులు, సన్నిహితులు, బినామీలకు సంబంధించిన మరో నాలుగు ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు.

రూ.1.20 కోట్ల విలువైన స్థిరాస్తుల గుర్తింపు

సోదాల్లో పలు ఆస్తులకు సంబంధించిన పత్రాలను అధికారులు గుర్తించారు. సరూర్‌నగర్ పరిధిలోని లింగోజిగూడలో 150 చదరపు గజాల చొప్పున ఉన్న రెండు ప్లాట్లు,వాటిపై పాత ఇల్లు కలిపి రూ.30 లక్షలుగా అంచనా వేశారు. ఎల్బీనగర్ లోని మాన్సూరాబాద్ సీఆర్ ఎన్‌క్లేవ్‌లో 240 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న పాత ఇంటి విలువ రూ.40 లక్షలుగా పేర్కొన్నారు. అలాగే పెరూర్ గ్రామంలో 180 చదరపు గజాల్లో నిర్మాణంలో ఉన్న ఇంటి విలువ రూ.50 లక్షలుగా గుర్తించారు.
మిర్యాలగూడ పరిధిలోని హాలియాలో రెండు ఎకరాల వ్యవసాయ భూమిని సుమారు రూ.80 లక్షలుగా అంచనా వేశారు. అయితే ఈ ఆస్తుల మార్కెట్ విలువ అధికారిక అంచనాల కంటే చాలా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఏసీబీ ప్రెస్‌నోట్‌లో పేర్కొంది. అంతేకాకుండా, హాలియాలో మరికొంత వ్యవసాయ భూమిని కూడా అధికారి కొనుగోలు చేసినట్లు తదుపరి విచారణలో వెల్లడైందని తెలిపింది.

నగదు,బంగారం,కారు స్వాధీనం

సోదాల్లో రూ.7 లక్షల నగదుతో పాటు సుమారు 60 తులాల బంగారు ఆభరణాలను గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.5 లక్షలుగా పేర్కొన్నారు. మారుతి విటారా బ్రెజ్జా కారును సుమారు రూ.6.50 లక్షలుగా అంచనా వేశారు. అదనంగా రూ.10 లక్షల విలువైన గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులను గుర్తించారు. ఇతర ఆస్తులపై కూడా ఏసీబీ అధికారులు పరిశీలన కొనసాగిస్తున్నారు.


గతంలోనూ లంచం కేసులో అరెస్టు

కీసర పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలోనే అంజనేయులు లంచం కేసులో పట్టుబడినట్లు ఏసీబీ వెల్లడించింది.ఈ ఏడాది సెప్టెంబర్ 16న అధికారికంగా అనుకూల నిర్ణయం తీసుకునేందుకు రూ.8 లక్షలు డిమాండ్ చేసి, తన సబార్డినేట్ ఎస్ఐ డి. గణేందర్ రెడ్డి ద్వారా రూ.5 లక్షలు స్వీకరించినట్లు పేర్కొంది.ఈ కేసులో సెప్టెంబర్ 17న అంజనేయులును అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. ప్రస్తుతం ఆయన చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో ఉన్నట్లు ప్రెస్‌నోట్‌లో తెలిపింది.

రూ.2.28 కోట్లకు పైగా మొత్తం ఆస్తులు


ప్రస్తుత ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అంజనేయులుకు సంబంధించిన మొత్తం ఆస్తుల విలువ సుమారు రూ.2,28,50,000గా,అంటే రూ.2 కోట్ల 28 లక్షల 50 వేలుగా అంచనా వేసినట్లు ఏసీబీ వెల్లడించింది.ఈ కేసులో తదుపరి విచారణ నిమిత్తం ఆయనను పీటీ వారెంట్‌పై కోర్టు ముందు హాజరుపరచనున్నట్లు తెలిపింది.
ఆదాయానికి మించిన ఆస్తుల కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉంది.మరిన్ని ఆస్తుల వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఏసీబీ పేర్కొంది.

భవాని యూత్ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



ఎల్బీనగర్,(ప్రజావినికిడి):దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం రోజు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని సాయిబాబా కాలనీ నందు భవాని యూత్ వారి అమ్మవారిని దర్శించుకుని,ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దూసకల్ లో దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



షాద్ నగర్,(ప్రజావినికిడి):ప్రజల్లో భక్తుల్లో ఆధ్యాత్మిక భక్తి భావం సంతరించుకోగా శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.షాద్ నగర్ నియోజకవర్గంలోని ఫరుక్ నగర్ మండలం దూసకల్ గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ,సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని అమ్మవారిని ప్రార్థిస్తూ ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అనిత రఘునాథ్ యాదవ్,పోమాలపల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,మాజీ సర్పంచ్ మురళీధర్ రెడ్డి,కాంటెస్టెడ్ కౌన్సిలర్ రాజేందర్ సింగ్,మాజీ ఉప సర్పంచ్ వి.శివకుమార్ యాదవ్ నాయకులు భాగం కృష్ణయ్య, చౌలపల్లి కృష్ణా రెడ్డి,రాజు గౌడ్,కమ్మరి శ్రీను, శివ,కారే ప్రకాశ్, కారే గణేష్, కావాలి అశోక్, చాట్ల శివ, వెంకట్ రెడ్డి, భాగం కుమార్, వంశీ,విష్ణు వర్ధన్ రెడ్డి,కుమ్మరి రాజు, జయసింహ రెడ్డి, వంశీ,శరత్ తదితరులు పాల్గొన్నారు.



శంషాబాద్ లో కూల్చివేతల కలకలం..

111 జీవో ఉల్లంఘన పేరుతో భవనాలపై చర్యలు.. - అధికారులతో స్థానికుల వాగ్వివాదం







శంషాబాద్, (ప్రజావినికిడి): అక్టోబర్ 17, శంషాబాద్ జీహెచ్ఎంసీ జోన్ పరిధిలోని మధురానగర్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత చర్యలు ఉద్రిక్తతకు దారితీశాయి. 111 జీవో నిబంధనల ఉల్లంఘనతో పాటు, అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలపై జీహెచ్ఎంసీ అధికారులు చర్యలకు దిగడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. కూల్చివేతలను అడ్డుకునేందుకు భవన యజమానులు, స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో అధికారులకు, స్థానికులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. శంషాబాద్, మధురానగర్‌లోని బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల అధికారులు కూల్చివేత చర్యలు చేపట్టారు. నిర్మాణాలకు అవసరమైన అనుమతులు లేకపోవడం,111 జీవో నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించడంతో చర్యలకు ఉపక్రమించినట్లు సమాచారం. పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ నిర్మాణ పనులు కొనసాగించారనే కారణంతో కూల్చివేతలు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నట్లు తెలిసింది.
అయితే, అధికారులు కూల్చివేతలు ప్రారంభించడంతో భవన యజమానులు, స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ భవనాలపై చర్యలు తీసుకోవడాన్ని నిరసిస్తూ అధికారులను నిలదీశారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కూల్చివేతలను అడ్డుకునేందుకు స్థానికులు ప్రయత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అధికారుల చర్యలతో తమకు నష్టం జరుగుతోందని భవన యజమానులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది.
మరోవైపు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిందేనని అధికారులు స్పష్టం చేసినట్లు సమాచారం. మధురానగర్‌లో చోటుచేసుకున్న ఈ పరిణామాలతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కూల్చివేతల ప్రక్రియ,భవన యజమానుల అభ్యంతరాలు, అధికారులు అనుసరిస్తున్న విధానాలపై స్థానికంగా చర్చ జరుగుతోంది.

మా సేవలు ఆకాశంలో..
మా బతుకులు అగాధంలో..

తెలంగాణలోని 12 యూనివర్సిటీల్లో పార్ట్‌టైమ్ అధ్యాపకుల దుస్థితి..

దశాబ్దాల సేవలకు భరోసా ఏదీ? ఉద్యోగ భద్రత కల్పించి, నియామకాల్లో న్యాయం చేయాలి..

ప్రభుత్వం స్పందించేది ఎప్పుడు.?

మా జీవితాలు బాగుపడేది ఎన్నడు.?

హైదరాబాద్,(ప్రజావినికిడి):
యూనివర్సిటీల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ, విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న పార్ట్‌టైమ్ అధ్యాపకుల జీవితాలు మాత్రం అగాధంలోనే కొట్టుమిట్టాడుతున్నాయి. దశాబ్దాలుగా సేవలందిస్తున్నా ఉద్యోగ భద్రత కరువై, చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దుస్థితి నెలకొంది. ఒకవైపు విశ్వవిద్యాలయాల అభివృద్ధికి తమ జీవితాలను అంకితం చేస్తుంటే, మరోవైపు తమ భవిష్యత్తుపై భరోసా లేకుండా బతుకులు వెళ్లదీయాల్సిన పరిస్థితి నెలకొనడం బాధాకరమని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం టీచర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు డాక్టర్ జీవన్ పాలడుగు, డాక్టర్ కాటేపాగ యుగంధర్, డాక్టర్ వీరు యాదవ్, డాక్టర్ ఆరుట్ల జానకి రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సంపత్ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న పార్ట్‌టైమ్ అధ్యాపకులు పర్మనెంట్ అధ్యాపకులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ, వారికి మాత్రం అతి తక్కువ వేతనాలు చెల్లించడం అన్యాయమని పేర్కొన్నారు. విద్యాబోధనతో పాటు యూనివర్సిటీల విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో కీలకంగా వ్యవహరిస్తున్న తమ సేవలకు తగిన గుర్తింపు, గౌరవం, ఆర్థిక భద్రత లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

12 నెలలు పని.. ఆరు నెలలకే జీతమా.?

పార్ట్‌టైమ్ అధ్యాపకులు ఏడాది పొడవునా, అంటే 12 నెలలు పూర్తిస్థాయిలో విధులు నిర్వహిస్తున్నప్పటికీ కేవలం ఆరు నెలలకు మాత్రమే వేతనాలు పొందుతున్నారని ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన నెలల్లో కుటుంబ ఖర్చులు, పిల్లల చదువులు, ఇంటి అద్దెలు, ఇతర నిత్యావసరాలను ఎలా తీర్చుకోవాలో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్యావ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న అధ్యాపకుల జీవితాలే ప్రశ్నార్థకంగా మారడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీతో పాటు పార్ట్‌టైమ్ అధ్యాపకుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నో సంవత్సరాల అనుభవం కలిగిన అధ్యాపకులను విస్మరించి, వారి సేవలకు విలువ ఇవ్వకుండా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి, నియామక ప్రక్రియలో వారి అనుభవానికి తగిన ప్రాధాన్యత ఇచ్చినప్పుడే నిజమైన న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు.

హామీలు కాదు.. ఆచరణలో న్యాయం కావాలి

పార్ట్‌టైమ్ అధ్యాపకుల సమస్యలను ఇకనైనా ప్రభుత్వం విస్మరించకుండా, వారి న్యాయమైన డిమాండ్లపై సానుకూలంగా స్పందించాలని అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు కోరారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధికి తమ శ్రమను, సమయాన్ని వెచ్చిస్తున్న అధ్యాపకులకు కనీస ఆర్థిక భద్రత లేకపోవడం విచారకరమన్నారు. విద్యను బలోపేతం చేయాలంటే ముందుగా విద్యాబోధన చేస్తున్న అధ్యాపకుల జీవితాల్లో భరోసా నింపాలని సూచించారు.
మా సేవలు ఆకాశంలో మా బతుకులు అగాధంలో అన్న పరిస్థితికి ముగింపు పలకాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు స్పష్టం చేశారు. పార్ట్‌టైమ్ అధ్యాపకుల సమస్యలను తక్షణమే పరిష్కరించి, 12 నెలల వేతనాలు, ఉద్యోగ భద్రత, నియామకాల్లో తగిన ప్రాధాన్యత కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



పార్ట్‌టైమ్ అధ్యాపకుల ప్రధాన డిమాండ్లు

1. 12 నెలలకు కన్సాలిడేటెడ్ పే చెల్లించాలి. ఏడాది పొడవునా పనిచేసే అధ్యాపకులకు ఆరు నెలలకే వేతనాలు చెల్లించే విధానాన్ని సరిచేయాలి.
2. ఉద్యోగ భద్రత కల్పించాలి. దశాబ్దాలుగా సేవలందిస్తున్న పార్ట్‌టైమ్ అధ్యాపకుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలి.
3. అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాల్లో అనుభవానికి వెయిటేజీ ఇవ్వాలి. పార్ట్‌టైమ్ అధ్యాపకుల బోధనా అనుభవాన్ని గుర్తించి తగిన ప్రాధాన్యత కల్పించాలి.
4. దరఖాస్తు చేసిన ప్రతి అభ్యర్థిని ఇంటర్వ్యూలకు అనుమతించాలి. అర్హులైన అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పించాలి.
5. యూనివర్సిటీల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఇప్పటికే విశ్వవిద్యాలయాల్లో సేవలందిస్తున్న వారి అనుభవం, అర్హతలను నియామక ప్రక్రియలో పరిగణనలోకి తీసుకోవాలి.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

కూరగాయల మార్కెట్‌ను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు..

ఏలినో కరువు వేళ రైతులకు నష్టం కలిగిస్తే సహించేది లేదు.. -రైతులకు న్యాయమైన ధరలు కల్పించాలని డిమాండ్..





షాద్ నగర్,(ప్రజావినికిడి):వ్యవసాయ కూరగాయల మార్కెట్‌లో రైతుల పట్ల ఎలాంటి వివక్ష ధోరణి చూపకుండా,వారు పండించిన పంటకు సరైన న్యాయమైన ధరలు కల్పించాలని మాజీ ఎమ్మెల్యే బక్కని డిమాండ్ చేశారు.స్థానిక వ్యవసాయ కూరగాయల మార్కెట్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా మార్కెట్‌కు వచ్చిన రైతులను, అక్కడి వ్యాపారులను అడిగి కూరగాయల ధరలు,తూకాలు మార్కెట్ నిర్వహణ తీరును ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌లో హోల్ సేల్ మరియు రిటైల్ ధరల నిర్ణయంలో తీవ్రమైన వ్యత్యాసాలు ఉండటం వల్ల కష్టపడి పంట పండించిన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులను ఆదుకోవాల్సిన చోట వారి పట్ల వివక్ష చూపడం తగదని హితవు పలికారు.మార్కెట్‌లో ధరల నిర్ణయం పారదర్శకంగా ఉండాలని,రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం కలగకుండా సరైన మద్దతు ధరలు దక్కేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ముఖ్యంగా మార్కెట్‌లో జరిగే తూకాలు, ధరల వివరాలు నమోదు చేసే 'తక్ పట్టి' విషయాలపై ప్రతి రైతు పూర్తి అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. వ్యాపారులు ఇచ్చే తక్ పట్టీలను క్షుణ్ణంగా పరిశీలించు కోవాలని,ఎక్కడైనా తేడాలు వస్తే తక్షణమే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.రైతు సంక్షేమమే ధ్యేయంగా మార్కెట్ కమిటీలు పనిచేయాలని, నిబంధనలు ఉల్లంఘించి రైతులకు తక్కువ ధరలు కట్టి మోసం చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

25 ఎకరాల సుశీల మార్కెట్ యార్డ్ కు బీజం వేసింది నారా చంద్రబాబు నాయుడు గారే.

అదేవిధంగా షాద్ నగర్ మార్కెట్ యార్డు 1958లో ప్రారంభించబడిందన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 25 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడి షాద్ నగర్ లో పత్తి మార్కెట్ ప్రారంభం చేయడం జరిగిందన్నారు.చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ గా మధుసూదన్ రావు ఆనాడు సీఎం ఆదేశాలు తో ఈ భూమిని అన్యక్రాతం చేయడానికి పూనుకున్న ఇద్దరు అధికారులను సస్పెండ్ చేసి ఈ భూమిని కాపాడి సుమారు రెండున్నర కోట్ల వ్యయంతో పత్తి మార్కెట్ యార్డ్ ను టిడిపి హయాంలో మంజూరు చేయడం జరిగిందన్నారు మార్కెట్ యార్డు ప్రారంభానికి ఎన్నికలు అడ్డురాగా తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మార్కెట్ యార్డ్ లో ప్రారంభించింది అన్నారు. అయితే నేడు కోట్ల రూపాయల విలువైన ఈ మార్కెట్ యార్డ్ స్థలాన్ని రక్షించిన మార్కెట్ యార్డ్ నిర్మితం కావడానికి ముఖ్య భూమిక పోషించిన చంద్రబాబు నాయుడు షాద్ నగర్ మార్కెట్ యార్డ్ క్రెడిట్ మొత్తం ఆయనకే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు తెలిపారు.

శివగంగ రాజరాజేశ్వరి ఆలయంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేక పూజలు

దేవి శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారి దర్శనం.. పరమేశ్వరుడికి అభిషేకం





మహేశ్వరం,(ప్రజావినికిడి): దేవి శరన్నవరాత్రుల సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం గ్రామంలో ఉన్న ప్రాచీన శివగంగ రాజరాజేశ్వరి ఆలయాన్ని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి పి.సబితా ఇంద్రారెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పరమేశ్వరుడికి ప్రత్యేక అభిషేకం చేసి భక్తిశ్రద్ధలతో స్వామివారి ఆశీస్సులు పొందారు.దేవి శరన్నవరాత్రుల వేళ ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మోసపోయినం.. ఘోష పడుతున్నం..

ఆనాడు కేసిఆర్ చెప్పిందే నిజమైంది..

ఎల్ నీ నో ప్రభావంతో పంటలు ఎండిపోతుంటే తమాషాలు చూస్తున్నారా..

పంటలు ఎండిన రైతులు పండుగ ఎలా చేసుకోవాలి..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచించాల్సిన తరుణం..

ప్రతి రైతుకు ఎకరాకు 50 వేలు పరిహారం ఇవ్వాలి..

లేదంటే సర్కారుతో ఇక యుద్ధమే..

షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ ఆగ్రహం..



షాద్ నగర్,(ప్రజావినికిడి):

రాష్ట్రంలో ఎల్ నీ నో ప్రభావంతో పంటలు ఎండిపోతున్నాయి..సకాలంలో విద్యుత్ అందించాల్సిన ప్రభుత్వం వేడుక చూస్తుంది.. పంటలు ఎండిపోయి అవస్థలు పడుతున్న రైతులు పండగ ఎలా చేసుకోవాలి.. కనీస ప్రణాళిక లేకుండా ప్రభుత్వం ఎలా నడిపిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇకనైనా స్పందించాలి.. నష్టపోతున్న అన్నదాతలకు పరిహారం అందించాలి.. లేదంటే సర్కారుపై ఇక యుద్ధమే..అని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ అన్నారు.షాద్ నగర్ పట్టణంలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం అన్నదాతలు మాత్రమే కాదు.. సామాన్యులు జీవించాలన్నా వ్యవసాయం బాగుండాలి. వ్యవసాయం బాగుండాలంటే నీరు,విద్యుత్ సమృద్ధిగా ఉండాలి. అందుకే గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ రైతుబంధు ద్వారా ఆర్థిక సాయం, సకాలంలో ఎరువుల పంపిణీ, వ్యవసాయ సమయంలో అతివృష్టి, అనావృష్టి పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమీక్షల నిర్వహణ ద్వారా వ్యవసాయాన్ని విజయవంతంగా ముందుకు నడిపించారన్నారు.కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎల్ నినో ప్రభావం వల్ల పంటలు ఎండిపోతుంటే విద్యుత్ ఇవ్వకుండా రైతుల సహనాన్ని పరీక్షిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.కనీసం పంటలకు 25 రోజులు పూర్తిస్థాయిలో కరెంటు ఇచ్చినా వ్యవసాయం బాగుపడుతుందని,అలాంటి సహకారం ప్రభుత్వం నుంచి లేకపోవడం వల్ల మొక్కజొన్న పూర్తిగా ఎండిపోయిందని, వరి చేలు కూడా పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందే కేసీఆర్ మోసపోతే ఘోషపడతామని చెప్పారని, ప్రస్తుతం అదే జరుగుతుందని అన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలోనే కరెంటు సమస్యలు, ఎరువుల కోసం కొట్టుకోవడం వంటిది జరిగాయని, ఇప్పుడు మళ్లీ అదే పునరావృతం అవుతుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 24 గంటలు కరెంటు ఇవ్వడంలో ఎప్పుడు కూడా రాజీ పడలేదని, కాంగ్రెస్ వచ్చాక ఆ తేడా స్పష్టంగా తెలుస్తుందని అన్నారు. ఎల్ నీ నో కారణంగా సమస్య ఉత్పన్నం అవుతుందని ముందే తెలిసినప్పటికీ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు ఎందుకు చేసుకోలేదని ప్రశ్నించారు. శ్రీశైలం, కాలేశ్వరం ద్వారా నీటిని నిలువ చేసుకొని రైతులకు అందించాల్సిన బాధ్యతను కూడా మర్చిపోయారని అన్నారు. సమీక్షల ద్వారా కనీసం అధికారులను అప్రమత్తం కూడా చేయని దుస్థితి నెలకొందన్నారు. 40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేసి అవినీతికి పాల్పడిన చరిత్ర కాంగ్రెస్ కే దక్కుతుందన్నారు. హైట్రో పవర్ లేకపోతే థర్మల్ పవర్ ద్వారా ఎందుకు విద్యుత్ ఉత్పత్తి చేసుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే చాలా వరకు నష్టం జరిగిందని కానీ ఎక్కడ ఎంత నష్టం జరిగిందో ఈరోజుకు తెలుసుకోలేకపోయారని వెల్లడించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి జరిగిన నష్టానికి రైతులకు ఎకరాకు 50 వేలు చొప్పున పరిహారం అందించాలని సూచించారు. కనీసం ఇంకో 20 రోజులైనా 24 గంటలు విద్యుత్ ఇచ్చి అన్నదాతలకు సహకరించాలన్నారు.లేదంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు.ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర సహకార యూనియన్ మాజీ కార్పొరేషన్ చైర్మన్ రాజా వరప్రసాద్,మాజీ మార్కెట్ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్,మాజీ పీఎసీఎస్ చైర్మన్ విఠల్,మాజీ మున్సిపల్ చైర్మన్ లావణ్య దేవేందర్ యాదవ్,మాజీ జడ్పీటీసీ ఎమ్మె శ్రీలత సత్యనారాయణ,మండల పార్టీ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, లక్ష్మణ్ నాయక్,కౌన్సిలర్లు శారద శేఖర్, వసంత శ్రీనివాస్, మహమ్మద్ ఎజాజ్ (అడ్డు),గోపాల్, మాజీ కౌన్సిలర్ జూపల్లి శంకర్,మాజీ సర్పంచులు రాజరామేశ్వర్ రెడ్డి,గోవిందు అశోక్,మాజీ ఎంపీటీసీ బిశ్వ రామకృష్ణ,నాయకులు రెడ్డి నర్సింలు,రవి యాదవ్, నందిగామ శ్రీనివాస్,ప్రేమ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అమీర్‌పేటలో విద్యుత్ సరఫరా అంతరాయాలతో రైతుల ఆవేదన.!

పంట పొలాలు ఎండిపోతున్నాయని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లిన రైతులు





మహేశ్వరం, (ప్రజావినికిడి): మహేశ్వరం నియోజకవర్గంలోని అమీర్‌పేట గ్రామంలో గత కొన్ని రోజులుగా విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో రైతులు,గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో పంట పొలాలకు సకాలంలో నీరు అందక పచ్చని పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో అమీర్‌పేట గ్రామ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి పి.సబితా ఇంద్రారెడ్డి స్వయంగా తెలుసుకున్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో వ్యవసాయ పనులకు కలుగుతున్న ఇబ్బందులను రైతులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సరఫరా సమస్యను పరిష్కరించి, వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సామ రామ్మోహన్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపు



షాద్ నగర్,(ప్రజావినికిడి):

హైదరాబాద్‌రంగారెడ్డిమహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమగ్ర సన్నాహక సమావేశంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు.శనివారం మహబూబ్‌నగర్‌లోని బృందావన్ గార్డెన్స్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకుఅనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ,పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మన అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో మన అభ్యర్థి విజయం ప్రభుత్వ పనితీరుకు రెఫరెండం లాంటిదని పేర్కొన్నారు.ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలమంతా కలిసికట్టుగా పనిచేస్తూ సామ రామ్మోహన్ రెడ్డి గెలుపునకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఎలాంటి ఇబ్బందులు,ప్రతికూల పరిస్థితులు ఎదురైనా వాటిని అధిగమించి అభ్యర్థి విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు.పట్టభద్రుల ఓటర్లను నేరుగా కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని, అర్హులైన ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు,ఎన్నికల ప్రచారంపై ప్రత్యేక దృష్టి సారించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పేరుతో విపరీతంగా అప్పులు చేసి రాష్ట్ర ప్రజలపై ఆర్థిక భారం మోపారని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని తెలిపారు.ఈ సమావేశంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు,వాకాటి శ్రీహరి,ఎంపీ మల్లు రవి,ఏఐసీసీ సభ్యులు చల్లా వంశీచంద్, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్ లు,డీసీసీ అధ్యక్షులు,మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, శేఖర్ రెడ్డి,చంద్రశేఖర్,శ్రీధర్,రాయికల్ శ్రీనివాస్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్,సీనియర్ నాయకులు రఘు నాయక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, బీఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.

దూసకల్ గ్రామంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా చండీ హోమం

ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ అగనూరు విశ్వం

షాద్ నగర్,(ప్రజావినికిడి):

దూసకల్ గ్రామంలో శ్రీ దుర్గామాత సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం దుర్గామాత మండపంలో చండీ హోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణలు,అర్చకుల పూజా కార్యక్రమాల నడుమ దంపతులు యాగంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమ కార్యక్రమం ఆద్యంతం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి.మాజీ మున్సిపల్ ఛైర్మన్ అగనూరు విశ్వం అప్ప,హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.దేవీ ఆరాధనకు విశేష ప్రాధాన్యత కలిగిన ఈ శుభదినాన చండీ హోమాన్ని నిర్వహించడం ద్వారా అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా దూసకల్ గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ





సుఖశాంతులతో జీవించాలని, ప్రతి కుటుంబంలో ఐశ్వర్యం వెల్లివిరియాలని, సమాజంలో ఐకమత్యం పెంపొందాలని దుర్గామాతను ప్రార్థించారు.
శ్రీ దుర్గామాత సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ హోమ కార్యక్రమం సందర్భంగా అమ్మవారి నామస్మరణలు, వేద మంత్రాలతో దుర్గామాత మండపం మార్మోగింది.ఈ కార్యక్రమంలో దూసకల్ మాజీ ఎంపీటీసీ స్వప్న చందు యాదవ్, మాజీ ఉపసర్పంచ్ శివకుమార్ యాదవ్,రిపోర్ట్ శ్వేత యాదవ్,చౌలపల్లి ఇంద్రసేనారెడ్డి, కిట్టు,కమ్మరి శీను చారి,ఉప్పరి మల్లేష్,చౌలపల్లి జైపాల్ రెడ్డి,చెగురి నవీన్ రెడ్డి, చాకలి విష్ణు, అల్వాల కుమార్, కమ్మరి సత్యనారాయణ,కుమార్ శ్రీ దుర్గ మాత సేవ సమితి సభ్యులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తుల జయజయధ్వానాల మధ్య కొనసాగుతున్నాయి.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

రాకాసి బొగ్గు కోసం ‘రామప్ప’ బలి?



తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ‘గ్లోబల్ సమ్మిట్-2.0’లో రాష్ట్ర పారిశ్రామిక ప్రగతి, పెట్టుబడి అవకాశాలతోపాటు చరిత్ర, సంస్కృతి, కళా వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో యునెస్కో ప్రపంచ వారసత్వ గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం తెలంగాణ గర్వానికి ప్రతీకగా నిలవనుంది. కానీ, ప్రపంచానికి రామప్ప గొప్పతనాన్ని చూపించాలనుకుంటున్న ప్రభుత్వం, అదే రామప్ప భవిష్యత్తుపై నెలకొన్న ఆందోళనలకు సమాధానం చెప్పగలదా? ఒకవైపు కాకతీయుల కళావైభవాన్ని అంతర్జాతీయ వేదికపై ప్రదర్శించే ప్రయత్నాలు జరుగుతుంటే, మరోవైపు రామప్ప సమీపంలో ప్రతిపాదించిన ఓపెన్‌కాస్ట్ గని ప్రభావాలపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు.ఈ వైరుధ్యమే ఇప్పుడు కీలకమైన ప్రశ్నను ముందుకు తెస్తోంది: రామప్పను ప్రపంచానికి పరిచయం చేయడం ఎంత ముఖ్యమో, దాన్ని కాపాడటం అంతకంటే ముఖ్యం కాదా? తెలంగాణలోని ములుగు జిల్లా వెంకటాపూర్‌లో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సిసిఎల్) ప్రతిపాదించిన పివి నరసింహారావు (పివిఎన్ఆర్) ఓపెన్‌కాస్ట్ గని చిన్న ప్రాజెక్టు కాదు. కేంద్ర పర్యావరణ మదింపు రికార్డుల ప్రకారం, ఏడాదికి 25 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయడంతోపాటు, గరిష్ఠంగా 37.5 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నారు. గని లీజు విస్తీర్ణం సుమారు 1,071 హెక్టార్లు. 2021 మార్చిలో కేంద్ర పర్యావరణ మదింపు కమిటీ సమావేశపు వివరాల్లో 931 మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉందని పేర్కొన్నారు.బొగ్గువల్ల విద్యుత్ ఉత్పత్తి, పారిశ్రామిక అవసరాలు, ఉపాధి, ప్రభుత్వ ఆదాయానికి ప్రయోజనాలు ఉండవచ్చు. వాటిని కొట్టిపారేయలేం. కానీ ఆర్థిక లాభాలతోపాటు పర్యావరణం, స్థానిక ప్రజలు భరించాల్సిన ఖర్చును కూడా లెక్కలోకి తీసుకోవాలి. రామప్ప కేవలం పర్యాటక ప్రదేశం కాదు. దాని శిల్పకళ, నిర్మాణ పద్ధతులు కాకతీయుల ప్రతిభకు సాక్ష్యాలు. దేవాలయంతోపాటు సరస్సు, పరిసర గ్రామాలు, అక్కడి జీవన సంప్రదాయాలూ ఈ ప్రాంత ప్రత్యేకతలో భాగమే. ప్రతిపాదిత గని రామప్ప దేవాలయానికి, సరస్సుకు సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉందని నివేదికల్లో పేర్కొంటున్నారు. అయితే, దూరం ఒక్కటే ప్రమాదానికి రుజువు కాదు; భద్రతకు హామీ కూడా కాదు. భౌగోళిక నిర్మాణాలు, భూగర్భజలాల ప్రవాహం, పేలుళ్ల ప్రభావం, సరస్సు కట్ట స్థిరత్వం, ఇతర గనుల సమష్టి ప్రభావాలను పరిశీలించినప్పుడే వాస్తవ పరిస్థితి తెలుస్తుంది.నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటికె), సూరత్‌కల్ అధికారిక రికార్డుల ప్రకారం, సింగరేణి ప్రాయోజకత్వంలో 2020లో వెంకటాపూర్ ప్రతిపాదిత గని వల్ల ఏర్పడే భూకంపనాలపై అధ్యయనం జరిగింది. రామప్పకు సంబంధించిన భారత పురావస్తు శాఖ (ఎఎస్ఐ) నిరభ్యంతర పత్రం, గనుల భద్రత డైరెక్టరేట్ (డిజిఎంఎస్) అనుమతుల ప్రక్రియకు సాంకేతిక ఆధారాలు అందించడం దీని ఉద్దేశం. అలాగే, ప్రతిపాదిత పివిఎన్ఆర్, కెటికె ఒసి – 111 గనుల వల్ల రామప్ప వారసత్వంపై పడే ప్రభావాలను పరిశీలించేందుకు జాతీయ పర్యావరణ ఇంజినీరింగ్ పరిశోధనా సంస్థ (ఎన్ఇఇఆర్ఐ) 2021 –2023 మధ్య అధ్యయనం నిర్వహించినట్లు తన అధికారిక రికార్డుల్లో పేర్కొంది. అయితే, అధ్యయనాలు జరిగాయనే కారణంతో అన్ని ప్రమాదాలూ తొలగిపోయాయని చెప్పలేం. వాటి పూర్తి నివేదికలు, కొలతలు, ఉపయోగించిన ప్రమాణాలు, అధ్యయన పరిమితులు, సిఫారసులను పరిశీలించాలి.2023లో ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రచురించిన కథనం ప్రకారం, ఎన్ఇఇఆర్ఐ, ఎన్ఐటికె అధ్యయనాల ఆధారంగా ఎఎస్ఐ పరిశీలన జరిపి, క్షేత్రస్థాయి కొలతల్లో అనుమతించిన పరిమితులకు మించిన ప్రభావాలు కనిపించలేదని, గని తవ్వకాలకు అభ్యంతరం లేదని నివేదిక పేర్కొన్నట్లు వార్త వచ్చింది. అదే కథనం ప్రకారం, పాలంపేట ప్రత్యేక అభివృద్ధి ప్రాధికార సంస్థ (పిఎస్‌డిఎ), కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్‌తో సంప్రదింపుల అనంతరం భూకంపనాలు, దేవాలయపు ఇసుక పెట్టె పునాదిపై భూగర్భజలాల ప్రభావం వంటి అంశాలపై 15 సాంకేతిక ప్రశ్నలకు సమాధానాలు కోరింది. ఈ వివరాలను సమతుల్యంగా చూడాలి. కొన్ని ప్రాంతాల్లో తీసుకున్న కొలతలు అనుమతించిన పరిమితుల్లో ఉన్నా, దీర్ఘకాలిక ప్రభావాలు లేదా భూగర్భజలాల మార్పులపై మరిన్ని ప్రశ్నలు ఉండవచ్చు. అదే సమయంలో, ప్రశ్నలకు సమాధానాలు లేవని చెప్పి దేవాలయం తప్పకుండా దెబ్బతింటుందని నిర్ధారించలేం. అందుకే ఎన్ఇఇఆర్ఐ, ఎన్ఐటికె పూర్తి నివేదికలతోపాటు ఎఎస్ఐ నిర్ణయానికి సంబంధించిన అసలు పత్రాలు ప్రజలకు అందుబాటులోకి రావాలి. గని తవ్వకాల వల్ల రామప్ప సరస్సు మట్టి కట్ట స్థిరత్వం దెబ్బతింటుందా? భూమిలోని సహజ రేఖలు, రాళ్ల పగుళ్ల ద్వారా నీటి ప్రవాహం మారుతుందా? భూగర్భజలాల మార్పులు దేవాలయపు ఇసుక పెట్టె పునాదిపై ప్రభావం చూపుతాయా? అనే ప్రశ్నలను విమర్శకులు లేవనెత్తుతున్నారు. ఇవి శాస్త్రీయంగా పరిశీలించాల్సిన అంశాలు. గని వల్ల భూగర్భజలాల ప్రవాహం మారే అవకాశం ఉందనడం, సరస్సు కట్ట తప్పకుండా తెగిపోతుందని చెప్పడం ఒకటి కాదు. అలాగే, సరైన అధ్యయనం లేకుండానే ప్రమాదం లేదని తేల్చేయడమూ సరికాదు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జిఎస్ఐ) పరిశీలనల వివరాలు, వివిధ కాలాల్లో భూగర్భజలాల కొలతలు, గని ప్రాంతానికి సరస్సు నీటి సేకరణ ప్రాంతానికి మధ్య ఉన్న సంబంధం, నీరు ఇంకిపోయే మార్గాలు, కట్ట స్థిరత్వంపై చేసిన అంచనాలను బహిర్గతం చేయాలి.

దాండియా సంబరాల్లో అపశృతి: విద్యార్థిని దుర్మరణం.. ఐదుగురి పరిస్థితి విషమం



హైదరాబాద్‌లోని నాదర్‌గుల్ ప్రాంతంలో ఉన్న ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం రాత్రి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కాలేజీలో నిర్వహిస్తున్న ‘సంగమం-2026‘ టెక్నికల్ మరియు కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన దాండియా వేడుకల్లో విషాదం నిండింది. వేడుకల కోసం ఏర్పాటు చేసిన భారీ ఇనుప విద్యుత్ దీపాల స్టాండ్ ఒక్కసారిగా విద్యార్థులపై కుప్పకూలింది.ఈ ప్రమాదంలో వనపర్తి జిల్లాకు చెందిన బీటెక్ విద్యార్థిని సోనీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఆమెతో పాటు మరో 25 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో మృతురాలి సోదరితో సహా ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన సిబ్బంది బాధితులను ఎల్‌బీ నగర్‌లోని కామినేని ఆసుపత్రికి, అలాగే అదభట్లలోని ఇతర ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.భారీ ఈదురుగాలుల కారణంగానే లైటింగ్ క్రేన్ అదుపుతప్పి కూలిపోయినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. స్టాండ్ కూలిన సమయంలో మంటలు కూడా చెలరేగడంతో విద్యార్థులు ప్రాణభయంతో పరుగులు తీశారు. ఈ ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన విద్యార్థిని కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

పంజాబ్‌లో డ్రగ్ మాఫియా పంజా



పంజాబ్‌లో మాదకద్రవ్యాల పులిపంజా ఎన్నో జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తోంది. యువత దీనికి బానిసై చిత్తయిపోతుండగా, దీనికి వ్యతిరేకంగా ఉద్యమాలు సాగించే సాహసవంతుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఈ డ్రగ్స్ మహమ్మారికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రముఖ సామాజిక ఉద్యమనేత పర్వీందర్ సింగ్ ఝోటా మంగళవారం ఉదయం ఒక ఫార్మాసిస్ట్ చేతిలో హత్యకు గురికావడం తీవ్ర సంచలనం కలిగించింది. పర్వీందర్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు అతని తండ్రి ఒప్పుకోలేదు సరికదా, గురువారం రాష్ట్ర వ్యాప్తంగా సంపూర్ణ బంద్‌కు పిలుపు ఇచ్చారు. దాదాపు అన్ని వర్గాల నుంచి ఈ బంద్‌కు పూర్తి మద్దతు లభించింది. కాంగ్రెస్, బిజెపి, శిరోమణి అకాలీదళ్, వారిస్ పంజాబ్ దే వంటి రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, మత సంస్థలు బంద్‌కు ఏకగ్రీవంగా మద్దతు ఇచ్చాయి. పర్వీందర్ సింగ్ గతంలో మాదక ద్రవ్యాల బానిసైనవారే.ఆ వ్యసనాన్ని విడిచిపెట్టి పరివర్తనం చెందారు. మాదక ద్రవ్యాల అక్రమ విక్రయాలను అడ్డుకుంటేనే కానీ యువత బతుకులు బాగుపడవన్న లక్ష్యంతో “ఫోర్స్” అనే సంస్థ ద్వారా ఉద్యమం చేపట్టారు. అక్రమంగా డ్రగ్స్ విక్రయిస్తున్న దృశ్యాలను తన మొబైల్ ఫోన్‌లో రికార్డు చేసి, వాటిని ఫేస్‌బుక్‌లో ప్రసారం చేసేవారు. ఈ విధంగా మంగళవారం ప్రత్యక్ష ప్రసారం చేస్తున్న సమయం లోనే ఆయన హత్య కూడా రికార్డు కావడం అత్యంత శోచనీయం. పంజాబ్‌లో ఈ సంఘటన ప్రజాగ్రహానికి దారి తీసింది. మరోవైపు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ మ్యాడ్ సంధు కూడా హత్యకు గురి కావడం వెనుక అంతర్రాష్ట్ర డ్రగ్ మాఫియా హస్తం ఉందని తెలుస్తోంది. ఈ రెండు సంఘటనల్లో డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల పాత్ర కనిపిస్తోంది. ఒకవైపు స్థానికంగా మాదక ద్రవ్యాల అక్రమ వ్యాపారం విచ్చలవిడిగా సాగుతుండగా, మరోవైపు మాఫియా సిండికేట్లు నిర్భయంగా తమ జూలు విదిల్చి హత్యలకు పాల్పడుతున్నాయి.దీంతో ప్రజల భద్రత ప్రమాదంలో పడుతోంది. ఈ మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలో పోలీసులు కూడా పాత్ర వహించడం, కొందరు పోలీసులు హత్యలకు గురికావడం ఆందోళన కలిగిస్తోంది. కేవలం రెండు వారాల వ్యవధి లోనే తర్న్‌తరన్, అమృత్‌సర్ జిల్లాలో ఇద్దరు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు కాల్పులకు గురయ్యారు. పంజాబ్ పోలీస్ కానిస్టేబుల్ కరణ్ దీప్ సింగ్ పెద్ద మొత్తంలో హెరాయిన్‌తో పట్టుబడడం గమనార్హం. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ, మాదక ద్రవ్యాల మాఫియా తన కార్యకలాపాలను కొనసాగిస్తూనే ఉంది. కానీ ప్రస్తుత ఆమ్‌ఆద్మీ ప్రభుత్వంపై శాంతిభద్రతల సంరక్షణలో వైఫల్యాలు తీవ్రంగా ఉన్నాయన్న విమర్శలు వస్తున్నాయి.

2025లో పంజాబ్ ప్రభుత్వం “యుద్ధ నషియాన్ విరుద్ధ్ ” అనే ప్రణాళికతో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాదారులు 68,850 మందిని అరెస్టు చేసింది.అలాగే రూ. 319 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది. అయితే ఇంతటితో సమస్య తీరిపోలేదు. ముఖ్యంగా యువతలో నిరుద్యోగం తదితర సమస్యలపై నిరాశా నిస్పృహలే మాదక ద్రవ్యాల బానిసత్వానికి దారి తీస్తున్నాయి. రాష్ట్రంలో ఉద్యోగాలు దొరకవని, విదేశాలకు వెళ్లడమే ఏకైక మార్గమన్న అభిప్రాయం ఎక్కువగా ఉంది. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల భవిష్యత్ కోసం ఎంతఖర్చయినా వెనుకాడకుండా విదేశాలకు పంపించాలన్న ఆలోచనలో ఉంటున్నారు. ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సర్వేలో 201718 సంవత్సరంలో 10 నుంచి 75 సంవత్సరాల మధ్య వయస్సు గల పంజాబ్ జనాభాలో 1.28 శాతం మంది ఓపియాయిడ్ మాదక ద్రవ్యాలపై ఆధారపడే స్థితిలో ఉన్నారని తేలింది. ఛండీగఢ్ లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ అండ్ కమ్యూనికేషన్ సంస్థ సరిహద్దు జిల్లా లకు చెందిన 1527 మందిపై చేసిన అధ్యయనంలో పంజాబ్‌లో మాదక ద్రవ్యాల బానిసలు 15 నుంచి 35 సంవత్సరాల మధ్యవయస్సు వారే అని బయటపడింది.అలాగే గ్రామీణ ప్రాంతానికి చెందిన వారిలో దాదాపు 70 శాతం మంది మత్తుకు చిత్తవుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ సంక్షోభం నుంచి యువతను తప్పించడానికి పర్వీందర్ ఝోటా ఉద్యమం సాగించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువతలో చైతన్యం తీసుకు రావడమే కాకుండా, పలు గ్రామ పంచాయితీలతో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా తీర్మానాలు చేయించారు. ఇవన్నీ డ్రగ్స్ మాఫియాకు అడ్డంకి కలిగించే చర్యలే. ఈ మాదక ద్రవ్యాల సమస్య అనేది కేవలం ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు. ఇది అక్రమ ఆర్థిక వ్యవస్థ, గ్యాంగ్‌స్టర్ల నెట్‌వర్క్, సరిహద్దుల మీదుగా స్మగ్లింగ్, ఇవన్నీ టార్గెట్ చేసుకుని సాగించే హత్యలు, ప్రజల భద్రతలో లోపాలు వంటి అనేక తీవ్ర సమస్యలతో ముడిపడి ఉన్న తీవ్ర సామాజిక, చట్టపరమైన సమస్య. దశాబ్దాలుగా అనేక హింసాత్మక సంఘటనలను చూసిన పంజాబ్ మళ్లీ “చిట్టా వే” రోజుల నాటి పరిస్థితులకు వెళ్లకూడదని ప్రజలు ఆశిస్తున్నారు. ఆ రోజుల్లో హెరాయిన్, కొకైన్ వంటి మాదక ద్రవ్యాలు యువతకు సాధారణ అలవాటుగా మారాయి. రానున్న ఎన్నికలు భగవంత్‌మాన్ ప్రభుత్వానికి ఎన్నో సవాళ్లను తీసుకు రానుంది. అందుకనే ఆమ్ ఆద్మీ ప్రభుత్వం మాదక ద్రవ్యాలను అరికట్టడానికి రెండు విధాల ప్రణాళికలను రూపొందించింది. ఈ ప్రణాళిక ఎంతవరకు ఆచరణ లోకి వస్తుందో చెప్పలేం. పర్వీందర్ లాంటి సామాజిక ఉద్యమ నేతలు సాహసించి ప్రజాచైతన్యం రగిలిస్తేనే మాఫియా మహమ్మారిని అడ్డుకోగలుగుతారు. దీనికి అన్ని వర్గాల ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభించవలసి ఉంది.

జంతర్ మంతర్ నోట్స్



ఢిల్లీ పత్రికలు రాసిన దాని ప్రకారం, జంతర్ మంతర్ గత 33 సంవత్సరాలుగా ఈ దేశ పౌరులకు నిరసన వేదికగా కొనసాగుతూ వస్తున్నది. దేశవ్యాప్తంగా అనేక వర్గాలకు, అనేక ప్రాంతాలకు చెందిన వారు తమ సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు అక్కడ శాంతియుతంగా నిరసనలను వేర్వేరు రూపాలలో జరుపుకుంటూ వస్తున్నారు. వారి వల్ల ప్రభుత్వానికి గాని, ప్రభుత్వం నుంచి వారికి గాని ఎన్నడూ సమస్యలు తలెత్తలేదు. ఏ కారణం వల్లనైనా నిరసనకారులను అక్కడినుంచి తొలగించవలసి వస్తే అటువంటి చర్యలు కూడా జరిగియి. అపుడు వారు అరెస్టయి తొలగిపోయారే తప్ప హింసాకాండలు చేయలేదు.ఈ 33 సంవత్సరాలలో కేంద్రంలో, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో పరిపాలించిన వాటిలో బిజెపి కూడా ఉంది. ఆందోళనలు వారూ జరిపారు. కాని ఎవరూ చేయని పనిని ఈనెల 11న ప్రధాన మంత్రి మోడీ ప్రభుత్వం చేసింది. ఆయన ప్రభుత్వంలో హోంమంత్రి అయిన అమిత్ షా అధికార పరిధిలో పనిచేసే ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్, జంతర్ మంతర్‌ను నిరసనల వేదికగా నిషేధించారు. లోగడ ఇండియా గేట్ వద్ద జరుగుతుండిన నిరసనలకు బదులు జంతర్ మంతర్‌ను నిర్దేశిత ప్రదేశం (డిజిగ్నేటెడ్ సైట్)గా ప్రకటించింది అప్పటి అధికారులే. ఇపుడు, తమ చర్యలపట్ల ప్రజల శాంతియుత నిరసనలను సహించలేని ప్రభుత్వం, అవి అట్లానే జరుగుతుంటే తమ అధికారానికే ముప్పు రావచ్చునన్న భయంతో, జంతర్ మంతర్‌ను మూసివేసింది.ఆ చర్యను నిరసనకారుల పక్షాన లాయర్లు సుప్రీంకోర్టులో సవాలు చేయటంతో, జంతర్ మంతర్‌కు ప్రత్యామ్నాయాన్ని అయినా చూపాలని న్యాయమూర్తులు అధికారులను ఆదేశించారు. వారి ఆదేశాలను ధిక్కరించలేరు గనుక పోలీస్ అధికారులు మూడు ఇతర ప్రదేశాలనైతే ప్రకటించారు. కాని, నిరసనలు జరగకుండా చూడాలన్న చాతుర్యం అక్కడే కనిపించింది. ఆ కొత్తవి ఏవి? ఒకటి, జంతర్ మంతర్ నుంచి సుమారు 4 కిలోమీటర్ల దూరానగల రాం లీలా మైదానం. రెండు, 12 కి.మీల దూరమున్న సిబిడి గ్రౌండ్. మూడు, 18 కి.మీ ల దూరపు బురారీ మైదానం. ఈ మూడు ప్రత్యామ్నాయాల వివరాలను గమనిస్తే, అవేవీ నిరసనలకు వీలైనవి కావని, కనీసం తేలికైనవి కావని అర్థమవుతుంది. అనగా, అసలు నిరసలనకు అవకాశం ఇవ్వకపోవటం మోడీ ప్రభుత్వపు ఉద్దేశమని స్పష్టమవుతుంది. ఆ ప్రత్యామ్నాయాల చిక్కులను లాయర్లు సుప్రీం కోర్టు దృష్టికి తెస్తూ, జంతర్ మంతర్‌ను పునరుద్ధరించాలని పిటిషన్ వేశారు. దానిపై ఏమి జరిగేదీ తెలియదు.ఈలోగా కాక్రోచ్ జనతా పార్టీ నాయకత్వమైతే ధిక్కారాన్ని ప్రకటించింది. జంతర్ మంతర్ ఎవరి సొత్తూ కాదన్నది. నిషేధాన్ని ఉల్లంఘిస్తూ అక్కడ యువతీ యువకులు చెదురుమదురు నిరసనలు జరుపుతుండగా పోలీసులు వారిని ప్రతి రోజు నిర్బంధించి కొడుతున్నారు. 13వ తేదీన అశుతోశ్ రాంకా, సౌరవ్ దాస్‌లను అరెస్ట్ చేసి 5రోజుల జుడీషియల్ కస్టడీకి పంపారు. నిరసనకారులను అన్ని రోజులపాటు కస్టడీకి పంపటం ప్రస్తుత ఆందోళనలు మొదలైన తర్వాత ఇది తొలిసారి. పూర్తి శాంతి యుతంగా నిరసన చేస్తున్న వారిపై, శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నారనే నేరారోపణ చేశారు. మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును కొద్దినెలలుగా గమనిస్తున్న వారికి అది ఆశ్చర్యాన్ని కలిగించలేదుఇపుడు, అధికారులు ప్రకటించిన ప్రత్యామ్నాయ వేదికలను చూద్దాము. నిరసన కార్యక్రమాలు జంతర్ మంతర్ సహా ఎక్కడ చేపట్టాలన్నా పోలీసుల అనుమతి అవసరం. కాని జంతర్ మంతర్ వేదిక ఉచితం కాగా, తక్కిన వాటిలో రోజుకు వేలాది రూపాయల ఫీజు చెల్లించాలన్నది మొదటి తేడా. రాం లీలా కాకుండా మిగిలిన రెండు చాలా దూరం కావటం రెండవది. జంతర్ మంతర్ నిరసనలకు ప్రత్యేకించినది కాగా, మిగతా మూడింటిలో పెళ్లిళ్లు, ఉత్సవాల వంటి రకరకాలు కార్యక్రమాలు జరుగుతుంటాయి. వాటన్నింటి మధ్య ఆ మైదానాలను చాలా ముందే బుక్ చేసుకోవలసి ఉంటుందన్నది మూడవది. జంతర్ మంతర్ వలె గాక అక్కడ చాలా పరిమిత కాలానికే బుకింగ్ చేస్తారన్నది నాల్గవది. నిరసనకారులకు ఆహారం, కాలకృత్యాలు, కనీసం కొద్ది పాటి షెల్టర్ వంటివి అక్కడ ఉండవన్నది అయిదవది. జంతర్ మంతర్, రాం లీలాలను మినహాయిస్తే తక్కిన రెండిండికి రాకపోకలు స్వంత వాహనాలు ఉన్నవారికి తప్పితే కష్టమైన పనికావటం ఆరవది. కాక్రోచ్ ఉద్యమంలో యువతులు, వృద్ధులు, పౌరులు మనం లోగడ ఎప్పుడూ చూడని స్థాయిలో పాల్గొంటున్నారు. తరచు కోర్టులనుంచి లాయర్లు వెళు తున్నారు. ఇపుడిక వీరికి కష్టమవుతుందన్నది ఏడవది.ఇటువంటి కష్టతరమైన ప్రత్యామ్నాయాలను చూపటంలోని పరమోద్దేశం ఏమై ఉంటుందో ఎవరైనా ఊహించగలరు. ఒక్క మాటలో చెప్పాలంటే, ట్రాక్టర్లలో టెంట్లు, ఆహారంతో వెళ్లే రైతుల వంటి తరగతులను మినహాయించి (వారు కూడా రోజుకు వేల రూపాయల ఫీజులు కట్టడం జరిగేది కాదు), యువతరం నిరసనలన్నవి ఇక జరగకుండా చూడటమన్నది అర్థమవుతున్నదే. మోడీ ప్రభుత్వం నిరసనలంటే అంతగా భయపడుతూ భయపడుతూ, ఇంతటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్నదన్న మాట. ఒకపుడు 1975 ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా తీవ్రమైన ఉద్యమం సాగించిన పార్టీ, ఇప్పుడు అదే ఎమర్జెన్సీని అందరికీ గుర్తుచేస్తే స్థితికి చేరి, తన అధికార పరిరక్షణ కోసం భయకంపితమై వ్యవహరిస్తున్నది. అటు వంటి భయకంపిత స్థితిని బట్టే అధికార పక్షం ఎంతగా బలహీనపడుతున్నదో గ్రహించవచ్చు. సిజెపి నేత అభిజిత్ దీప్కే పదేపదే వ్యాఖ్యానిస్తున్నట్లు మోడీ ఒక “పిరికి నియంత” గా మారారు. పలువురు పరిశోధకులు ఎత్తి చూపుతున్నమాట, నియంతలలో అనేకులు పిరికివారనే.జంతర్ మంతర్ ప్రజాస్వామ్యానికి గల పలు చిహ్నాలలో ఒకటిగా దశాబ్దాలుగా కొనసాగుతున్నా, మనం ప్రస్తుతం చూస్తున్నటు వంటి స్థితి ఎన్నడూ లేదు. గతంలో జరిగిన నిరసనలన్నీ నిర్దిష్ట మైన వర్గాల నిర్దిష్ట ఫిర్యాదులపై చోటుచేసుకున్నవి. ఇటీవలి కాలపు నీట్ నిరసనలు కూడా అదే వర్గీకరణలోకి వస్తుంది గాని, ‘సర్’ విషయం అటువంటిది కాదు. ‘సర్’ ప్రక్రియను అధికార పక్షం తన అధికారపు మనుడగతో ముడిపెట్టి చూసుకున్నది. మరొక వైపు ప్రజలు, సిజెపి వంటి యువజన సంస్థలు, ప్రతి పక్షాలు ఈ దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడతో ముడిబెట్టి చూస్తున్నారు. ఆ విధంగా ఇది ఒక మౌలిక సంఘర్షణ అవుతున్నది. అధికార పక్షపు మౌలికతలో రెండు అంశాలున్నాయి. ఒకటి, యథాతథంగా వారి రాజకీయాధికార పరిరక్షణ. రెండవది అంతకన్న ముఖ్యమైనది. అది, బిజెపి ఒక భాగంగా గల సంఘ్ పరివార్ దీర్ఘకాలిక లక్షమైన హిందూ రాజ్యస్థాపన ప్రణాళికకు ప్రస్తుత పరిణామాలు భంగం కలిగించగలవేమోనన్న సందేహాలు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

నిధి అన్వేషణలో 'వృషకర్మ'



అగ్ర కథానాయకుడు నాగచైతన్య నటిస్తున్న మిథికల్ థ్రిల్లర్ 'వృషకర్మ'. మీనాక్షి చౌదరి కథానాయిక. కార్తీక్ దండు దర్శకత్వంలో బీవీఎస్ఎన్ ప్రసాద్‌తో కలిసి అగ్ర దర్శకుడు సుకుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ గురువారం మేకర్స్ ఓ ప్రకటనను విడుదల చేశారు.విడుదలకు ఇంకా 50రోజులు మాత్రమే సమయం ఉండటంతో ఓ సరికొత్త పోస్టర్‌ని కూడా విడుదల చేశారు.స్టైలిష్‌గా, యాక్షన్ అవతార్‌లో పదునైన కత్తులు అమర్చబడ్డ ఓ లోహపు తాడును ఆయుధంగా చేతబట్టి కనిపిస్తున్న నాగచైతన్యను ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ఆయన చుట్టూ ఉన్న వాతావరణం తుఫానుని తలపిస్తున్నది.నిధి అన్వేషణ నేపథ్యంలో మైథాలజీ, అడ్వెంచర్ అంశాలతో.. ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో భారీ స్థాయిలో ఈ సినిమా తెరకెక్కుతున్నదని మేకర్స్ తెలిపారు. నాగచైతన్య కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాకు ప్రీరిలీజ్ బిజినెస్ కూడా భారీగా జరిగిందని మేకర్స్ చెప్పారు. స్పర్ష్ శ్రీవాస్తవ విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రాగుల్ డి.హెరియన్, సంగీతం: అజనీష్ బి.లోక్‌నాథ్, సమర్పణ: బాపినీడు, నిర్మాణం: శ్రీవెంకటేశ్వర సినీచిత్ర, సుకుమార్ రైటింగ్స్.



గరివిడి లక్ష్మిగా నటించినందుకు గర్వపడుతున్నా

ఏపీకి చెందిన ప్రముఖ జానపద గాయని గరివిడి లక్ష్మి జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'గరివిడి లక్ష్మి'. టైటిల్‌రోల్‌ని ఆనంది పోషించింది. గౌరినాయుడు జమ్ము దర్శకుడు. పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన ఈచిత్రం ఈ నెల 17న విడుదల కానున్నది.ఈ సందర్భంగా వైజాగ్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్‌ని మేకర్స్ నిర్వహించారు. కేంద్రమంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ఏపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, హీరో తేజా సజ్జా, డైరెక్టర్ మోహన్‌రాజా ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందంచారు.విజయశాంతికి 'కర్తవ్యం', సౌందర్యకు 'అమ్మోరు', అనుష్కకు 'అరుంధతి', కీర్తిసురేశ్‌కు 'మహానటి ఎలాగో ఆనందికి 'గరివిడి లక్ష్మి' అలా నిలుస్తుందని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ నమ్మకంగా చెప్పారు. 'గరివిడి లక్ష్మి' పాత్ర చేసినందుకు గర్వంగా ఉందని నటి ఆనంది చెప్పారు. ఇంకా దర్శకుడు గౌరీనాయుడు జమ్ము, సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ కూడా మాట్లాడారు.



చందమామ కథలా 'కరికాల'

సందీప్‌కిషన్ కథానాయకుడిగా రూపొందుతున్న సోషియో ఫాంటసీ చిత్రం 'కరికాల'. కేథరిన్ థ్రెసా, గాయత్రి భరద్వాజ్, సాక్షి మడోల్కర్ కథానాయికలు. యుగంధర్ ముని దర్శకత్వంలో రెండు భాగాలుగా ఈ చిత్రం తెరకెక్కనున్నది. తొలిభాగాన్ని వచ్చే ఏడాది జూలై 2న, మలిభాగాన్ని వచ్చే ఏడాది అక్టోబర్ 28న విడుదల చేయనున్నారు.మహిధర్‌రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మాతలు. ఈ సినిమా పూజా కార్యక్రమాలు గురువారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి. నిర్మాత రాజశేఖర్ అన్నభీమోజు తల్లి సత్యవతి కెమెరా స్విచాన్ చేయగా, మరో నిర్మాత మహిధర్‌రెడ్డి తల్లి పద్మారెడ్డి క్లాప్ కొట్టారు. తొలి సన్నివేశాన్ని ఆది సాయికుమార్ గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాత రాజశేఖర్ తండ్రి వీరభద్రాచారి స్క్రిప్ట్‌ని అందజేశారు. అతిథులంతా సినిమా బాగా రావాలని శుభాకాంక్షలు అందించారు. 'ఈ సినిమా రెండు పార్టులకు సంబంధించిన కథ దర్శకుడు వివరించాడు.అయితే.. ఒక్కనిమిషం కూడా బోర్ అనిపించలేదు. గత ఆరేడు నెలలుగా ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతూనే ఉన్నాయి. ఇలాంటి దర్శక,నిర్మాతలు దొరకడం నా అదృష్టం. నాకెరీర్‌లోనే 'కరికాల' బెస్ట్ సినిమా అవుతుంది' అని సందీప్‌కిషన్ చెప్పారు. ఈ ఫ్రాంచైజీ ఓ చందమామ కథలా ఉంటుందని దర్శకుడు యుగంధర్ తెలిపారు. ఇంకా నిర్మాతలు, కథానాయికలు, సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల కూడా మాట్లాడారు.



న్యాయవాది పాత్రలో సునీల్

కామెడీతో పాటు పవర్‌ఫుల్ విలనిజాన్ని ప్రదర్శిస్తూ ప్రేక్షకుల్ని మెప్పిస్తున్నారు నటుడు సునీల్. తాజాగా ఆయన లాయర్‌గా విభిన్నమైన పాత్రలో కనిపించబోతున్నారు. 'డ్యూ డేట్' సినిమాలో సునీల్ ఈ పాత్రను పోషిస్తున్నారు. లోమేష్ పుడిపెద్ది హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి ఆనంద్ కె దర్శకత్వం వహిస్తున్నారు. పవన్ తరిగోపుల, ఏలూరు శ్రీను నిర్మాతలు.ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతున్నది. నేటి సమాజంలోని ఓ బర్నింగ్ ఇష్యూని కథా వస్తువుగా తీసుకొని ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, కోర్ట్‌రూమ్ డ్రామాగా ఆకట్టుకుంటుందని, సునీల్ పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటుందని మేకర్స్ తెలిపారు. జయశ్రీ, ప్రణీత పట్నాయక్, కృష్ణభగవాన్ తదితరులు చిత్ర తారాగణం.



వాటి గురించి ఇప్పుడే చెప్పలేను

సాధారణంగా ఎక్కువమంది హీరోయిన్లు 'మేం తింటాం కానీ వంట చేయలేం' అంటుంటారు. కానీ శ్రీలీల మాత్రం ఎలాంటి వంటనైనా ఈజీగా చేసేస్తానంటున్నది. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో తనలోని పాకశాస్త్ర నైపుణ్యం గురించి శ్రీలీల మాట్లాడింది. 'నాకు సాంబారు, కొబ్బరన్నం, కుర్మాకూర.. ఇలా చాలా వంటలు వచ్చు. అయితే.. ఎలాంటి వెరైటీ వండినా.. పెరుగన్నం మాత్రం నా మెనూలో పక్కగా ఉండాల్సిందే.చిన్నప్పట్నుంచీ పెరుగన్నమంటే చాలా ఇష్టం' అని శ్రీలీల పేర్కొన్నారు. సినిమాల్లో ఎక్కువగా కనిపించడం లేదేంటి? అనడిగితే.. 'గత కొన్ని రోజులుగా షూటింగులతో బిజీగా ఉన్నాను. నేను చేస్తున్న సినిమాలకు చెందిన వివరాల గురించి యూనిట్ సభ్యులు అధికారికంగా ప్రకటించలేదు. అందుకే ఆ సినిమాల గురించి నేను ఇప్పుడే చెప్పలేను. ప్రస్తుతానికైతే రెండ్రోజులు బ్రేక్ దొరికింది. ఈ విలువైన సమయాన్ని ఫ్యామిలీతో స్పెండ్ చేస్తున్నా' అంటూ చెప్పుకొచ్చారు శ్రీలీల.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613